
E-KABURU E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

(తేదీ) 31-07-2025 (వారం) గురువారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



ఎమ్మెల్యేల ఫిరాయింపుపై నేడు సుప్రీం తీర్పు » 2లో

ఇలాంటి సిరీస్ చూడలేదు.. పిచ్ విషయంలో ఎందుకింత గొడవ? శుభ్‌మన్ గిల్ » 6లో



దేశంలో ఏఐ, ఎడ్‌టెక్‌ల విస్తరణ.. కానీ.. » 4లో



బోల్డ్‌గా ఉన్నంత మాత్రాన.. అలా ప్రవర్తిస్తున్నట్టు కాదు: అనసూయ » 5లో



# భారత్ పై 25% శాతం సుంకం



- రష్యా నుంచి ఆయుధాలు, చమురు కొంటున్నందుకు జరిమానా కూడా!
- సుంకాల అమలు రేపటి నుంచే.. ఈసారి గడువు పొడించే ప్రసక్తే లేదు
- ఇండియా మాకు మిత్రదేశమే అయినా.. భారీ సుంకాలు వేస్తోంది: ట్రంప్
- తాజా సుంకాల ప్రభావాన్ని పరిశీలిస్తున్నాం: కేంద్ర ప్రభుత్వ వర్గాల వెల్లడి
- 2 దేశాలకూ లాభదాయకమైన ఒప్పందం కుదురుతుందని ఆశాభావం
- మోదీ, ట్రంప్ మధ్య స్నేహంతో ప్రయోజనం లేదని తేలింది: విపక్షాలు

వాషింగ్టన్, ఈ కబురు: రెండోసారి అధికారం చేపట్టినప్పటి నుంచి సుంకాల రంకెలేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారత ఉత్పత్తులపై 255 సుంకం విధిస్తున్నట్టు తాజాగా ప్రకటించారు. శుక్రవారం (ఆగస్టు 1) నుంచి ఈ సుంకం అమల్లోకి వస్తుందని ప్రకటించారు. సుంకంతోనే సరిపెట్టలేదాయన.. రష్యా నుంచి చమురు, ఆయుధాలు కొనుగోలు చేస్తున్నందుకుగాను భారత్‌పై జరిమానా కూడా విధిస్తామని హెచ్చరించారు. అమెరికా విమోచన దినం పేరుతో ఈ ఏడాది ఏప్రిల్ 2న ఆయన భారత్‌పై 265 సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. అయితే.. భారత్ సహా పలుదేశాలపై సుంకాల అమలును 90 రోజులపాటు నిలిపివేస్తున్నట్టు ఆయనే ఏప్రిల్ 9వ తేదీన మరొక ప్రకటన చేశారు. అప్పటిదాకా.. చైనా వంటి కొన్నిదేశాలు మినహా మెజారిటీ దేశాలపై 10 శాతం సుంకం వసూలు చేస్తానని చెప్పారు. భారతదేశం తమకు మిత్రదేశమే అయినప్పటికీ..

తరువాయి 2లో

# సునామీ ప్రకంపనలు



» రిక్టర్ స్కేల్‌పై 8.8 తీవ్రతతో సంభవించిన భూకంపం
» రష్యా, జపాన్, అమెరికా, హవాయ్ తీరాలను తాకిన భీకర సునామీ అలలు
» రష్యా తూర్పు తీరం వెంబడి పసిఫిక్ మహాసముద్రంలో మొదలైన ప్రకంపనలు
» తీరపట్టణాలను కుదిపేసిన అత్యంత ఎత్తైన అలలు
» చివురుటాకులా వణికిన తీరదేశాల ప్రజలు

తరువాయి 3లో

## ట్రంప్‌తో మోదీ స్నేహం ఇంతేనా..?

సుంకాలపై మండిపడ్డ విపక్షాలు



ఈ కబురు: భారత్ నుంచి దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై 25శాతం సుంకాలు, పెనాల్టీ విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించిన విపక్షాలు.. అమెరికా అధ్యక్షుడితో మోదీ స్నేహం ఇంతేనా అంటూ

తరువాయి 2లో

# ఉచితాల కోసం కొత్త డిస్కమ్



- రాష్ట్రం యూనిట్‌గా ఏర్పాటు చేయాలని సూచన
- వ్యవసాయానికి, ఇళ్లకు, స్కూళ్లు, కాలేజీలకిచ్చే ఉచిత విద్యుత్ దీని పరిధిలోకి..
- రుణాలపై వడ్డీ భారం తగ్గేలా చర్యలు చేపట్టాలన్న సీఎం
- విద్యుత్ శాఖపై డిప్యూటీ సీఎం భట్టితో కలిసి సమీక్ష

ఈ కబురు, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా మరో విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కమ్) ఏర్పాటు కానుంది. వ్యవసాయానికి, ఇళ్లకు 200 యూనిట్ల వరకు, ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలకు ఇచ్చే ఉచిత విద్యుత్‌ను పర్యవేక్షించేందుకు వీలుగా ఒక ప్రత్యేక డిస్కమ్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇది రాష్ట్రం యూనిట్‌గా పని చేస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా పర్యవేక్షిస్తుందని చెప్పారు. డిస్కమ్‌ల స్థితిగతులు, ఆర్థిక క్రమశిక్షణ మెరుగుపడాలంటే విధిగా విద్యుత్ సంస్కరణలు అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. వివిధ ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న రుణాలపై వడ్డీ భారం తగ్గించుకునేందుకు వీలుగా రీస్ట్రక్చరింగ్‌కు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించా రు. బుధవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీలు హరీశ్, కృష్ణభాస్కర్.. డిస్కమ్‌ల సీఎండీలు ముషారఫ్, వరుణ్‌రెడ్డి, సింగరేణి సీఎండీ బలరాం, రెడ్‌కో ఎండీ అనిల తదితరులతో సీఎం సమీక్ష జరిపారు.

తరువాయి 2లో

# మోదీకి ధైర్యం లేదు

- ట్రంప్ అబద్ధాలాడుతున్నారని చెప్పలేకపోతున్నారు
- అలా చేస్తే ఆయన నిజం బయటపెడ్తారు: రాహుల్
- 2 గంటల ప్రసంగంలో ఒక్కసారీ ట్రంప్ పేరెత్తలేదు
- భారత్‌పాక్ ఘర్షణలో మూడోపక్షం జోక్యాన్ని ఎందుకు అంగీకరించారు?: మల్లికార్జున ఖర్గే

తరువాయి 3లో



న్యూఢిల్లీ, ఈ కబురు: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబుతున్నదంతా అబద్ధమని ప్రధాన మంత్రి మోదీ చెప్పలేకపోతున్నారని కాంగ్రెస్ విమర్శించింది. భారత్‌పాక్ మధ్య కాల్పుల విరమణలో తాను కీలక పాత్ర పోషించానని ట్రంప్ ఇప్పటికి దాదాపు 30సార్లు ప్రకటించుకోవడంపై మోదీ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేసింది. ట్రంప్ అబద్ధం చెబుతున్నారని చెప్పే ధైర్యం మోదీకి లేదని ఎద్దేవా చేసింది. కాల్పుల విరమణ విషయంలో తన పాత్ర గురించి ట్రంప్ అబద్ధం చెబుతున్నారని మోదీ చెప్పలేరని, అలా చేస్తే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిజాన్ని బయట పెడతారని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ విమర్శించారు.



# గొర్రెల కుంభకోణంలో రంగంలోకి ఈడీ

- రూ.700 కోట్ల మళ్లింపుపై ఆరా
- గ్రేటర్ హైదరాబాద్‌లో 8 చోట్ల ఏకకాలంలో సోదాలు
- తలసాని మాజీ ఓఎస్డీ కల్యాణ్‌కుమార్ విచారణ
- ఈడీ కార్యాలయానికి వచ్చిన కల్యాణ్‌కుమార్

తరువాయి 2లో

# నింగిలోకి నిసార్

» జీఎస్ఎల్వీ-ఎఫ్16 ప్రయోగం విజయవంతం
» అంతరిక్షంలోకి దూసుకెళ్లిన భూపరిశీలన ఉపగ్రహం
» ఇస్రో-నాసా ఉమ్మడి ప్రయోగం గ్రాండ్ సక్సెస్
» 19 నిమిషాల్లోనే నిర్దేశిత కక్ష్యలోకి నిసార్ ఉపగ్రహం
» జీఎస్ఎల్వీ ప్రయోగాల్లో మరోసారి ఇస్రో సత్తా
» సంస్థ చరిత్రలో ఇదొక మైలురాయి: నారాయణన్



సూళ్లూరుపేట, తడ, ఈ కబురు: అంతరిక్ష రంగంలో ఇస్రో మరో అద్భుత విజయాన్ని అందుకుంది. అమెరికా అంతరిక్ష సంస్థ నాసాతో కలిసి చేపట్టిన భూపరిశీలన ఉపగ్రహం నిసార్ (నాసాఇస్రో సింథటిక్ అపార్చర్ రాడార్) ప్రయోగం విజయవంతమైంది. యావత్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన నాసా ఇస్రో మిషన్ సక్సెస్ కావడంతో ఇస్రో ఉత్సాహం రెట్టింపైంది. ఇస్రో చరిత్రలో ఈ ప్రయోగం ఒక మైలురాయిగా నిలిచింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రంషార్ నుంచి బుధవారం సాయంత్రం 5:40 గంటలకు నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకెళ్లిన జీఎస్ఎల్వీఎఫ్16 రాకెట్..

తరువాయి 2లో

## ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు బార్క్ లే సుముఖత



తరువాయి 2లో


## మణిపూర్‌లో మరో ఆరు నెలల రాష్ట్రపతి పాలన



తరువాయి 3లో

మొదటి పేజీ తరువాయి

# భారత్‌పై 25% శాతం సుంకం



అమెరికా విమోచన దినం పేరుతో ఈ ఏడాది ఏప్రిల్ 2న ఆయన భారత్‌పై 265 సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. అయితే.. భారత్ సహా పలు దేశాలపై సుంకాల అమలును 90 రోజులపాటు నిలిపివేస్తున్నట్టు ఆయనే ఏప్రిల్ 9వ తేదీన మరొక ప్రకటన చేశారు. అప్పటిదాకా.. చైనా వంటి కొన్నిదేశాలు మినహా మెజారిటీ దేశాలపై 10 శాతం సుంకం వసూలు చేస్తానని చెప్పారు. భారతదేశం తమకు మిత్రదేశమే అయినప్పటికీ.. ఆ దేశంతో అమెరికా చాలా సంవత్సరాలుగా పెద్దగా వ్యాపారం చేయలేకపోయిందని ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమమైన 'ట్రూత్ సోషల్'లో పేర్కొన్నారు. "ఎందుకంటే భారత్ విధించే సుంకాలు చాలా ఎక్కువగా ఉంటాయి. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలు విధిస్తున్న దేశాల్లో భారత్ ఒకటి. ఇతరదేశాలతో పోలిస్తే భారత్ అత్యంత కఠినమైన, గర్హనీయమైన ఆర్థికేతర పన్ను అడ్డంకులను విధించే దేశం" అని ఆయన ఆ పోస్టులో వివరించారు. "అంతేకాదు.. వారు (భారత్) ఎల్లప్పుడూ తమకు కావాల్సిన సైనిక పరికరాల్లో ఎక్కువ భాగం రష్యా నుంచే కొనుగోలు చేస్తారు. రష్యా నుంచి ఇంధనాన్ని కొనుగోలు చేసే అతిపెద్ద దేశాల్లో చైనాతో పాటు భారత్ కూడా ఉంది. ఇదంతా కూడా.. ఉక్రెయిన్‌లో రష్యా సాగిస్తున్న మారణకాండను నిలువరించాలని అందరూ అనుకుంటున్న వేళ జరుగుతోంది. ఇది మంచిది కాదు. అందువల్ల భారత్ ఉత్పత్తులపై 25% సుంకాలు, అదనంగా జరిమానా విధిస్తాం. ఇవి ఆగస్టు 1 నుంచి అమల్లోకి వస్తాయి." అని తేల్చిచెప్పారు. "ఆగస్టు ఒకటి అంటే.. ఆగస్టు ఒకటే. ఈసారి ఆ గడువును పొడిగించే ప్రసక్తే లేదు." అని హెచ్చరించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ట్రంప్.. వాణిజ్యంతోపాటు.. భారత్ 'బ్రిక్స్'లో భాగం కావడం కూడా 25% సుంకాల నిర్ణయానికి ఒక కారణమని తెలిపారు. బ్రిక్స్.. అమెరికా వ్యతిరేక కూటమి అని, అది డాలర్‌పై దాడి చేస్తోందని.. ఎవరైనా సరే, డాలర్‌పై దాడి చేయడాన్ని తాము అనుమతించబోమని ఆయన వ్యాఖ్యానించారు. "ప్రధాని మోదీ నా స్నేహితుడే. కానీ.. వాణిజ్యకోణంలో చూస్తే వారు (భారత్) మాతో పెద్ద ఎత్తున వ్యాపారం చేయట్లేదు. భారత్ మాకు అనేక ఉత్పత్తులను విక్రయిస్తోందిగానీ మేం వారి దగ్గర కొనదల్చుకోలేదు. ఎందుకంటే వారి సుంకాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలు వారు వసూలు చేస్తున్నారు. ఇప్పుడు వారు ఆ సుంకాలను గణనీయంగా తగ్గించడానికి సిద్ధంగా ఉన్నారు. చర్చలు జరుగుతున్నాయి. ఏం జరుగుతుందో చూడాలి. ఈ వారాంతానికి ఏ విషయమూ తేలుతుంది" అని ట్రంప్ పేర్కొన్నారు. కాగా.. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటిదాకా ఇరు దేశాల మధ్య.. వాణిజ్య ఒప్పందంపై ఐదుసార్లు చర్చలు జరిగాయిగానీ అవి ఒక కొలిక్కి రాలేదు. ఆరో దశ చర్చలు ఆగస్టులో జరగాల్సి ఉంది. ఇందుకోసం అమెరికా నుంచి ఒక బృందం ఆగస్టు 25న భారత్‌కు రానున్నట్టు ప్రభుత్వ వర్గాలు ఇటీవలే వెల్లడించాయి. ఇంతలోనే.. ట్రంప్ ఈ ప్రకటన చేయడం గమనార్హం.

**పరిశీలిస్తున్నాం..**

ట్రంప్ టారిఫ్‌ల ప్రభావం ఎంతమేరకు ఉంటుందనే అంశాన్ని పరిశీలిస్తున్నామని కేంద్రప్రభుత్వం తెలిపింది. సముచితమైన, సంతులిత, పరస్పర ప్రయోజనకారిగా, ఇరు దేశాలకూ లాభదాయకంగా ఉండే వాణిజ్య ఒప్పందం కుదురుతుందన్న ఆశ తమకు ఉందని.. ఆ దిశగా ఇరు దేశాల మధ్య చర్చలు జరుగుతున్నాయని పేర్కొంది. మరోవైపు.. భారత ఉత్పత్తులపై 25వ సుంకం, రష్యా చమురు కొన్నందుకు జరిమానా విధిస్తామంటూ ట్రంప్ చేసిన ప్రకటన నేపథ్యంలో విపక్షాలు కేంద్రంపై విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టాయి. ప్రధాని మోదీకి ట్రంప్‌తో ఉన్న స్నేహం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని దీంతో తేటతెల్లమైందని ఎద్దేవా చేశాయి. హౌడీ మోదీకి, ట్రంప్‌కు మధ్య ఉన్న 'తారిఫ్ (పరస్పర పొగడ్తలు)' పనికిరాలేదని.. ట్రంప్ మనపై టారిఫ్ (సుంకం), పెనాల్టీ (జరిమానా) వేశారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'టారిఫ్'.. 'తారిఫ్' అనే పదాలు ఉపయోగించి చురక వేశారు. ఇప్పటికైనా ప్రధాని మోదీ మాజీ ప్రధాని ఇందిరా గాంధీని ఆదర్శంగా తీసుకుని.. అమెరికా అధ్యక్షుడికి ఎదురుగా ధైర్యంగా నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. ట్రంప్ చేసిన ఎన్నో అవమానాలను మౌనంగా భరిస్తే భారత్‌కు ప్రయోజనాలు ఉంటాయని ప్రధాని మోదీ భావించారని.. కానీ అలా జరగలేదని జైరామ్ రమేశ్ వ్యాఖ్యానించారు.

**ట్రంప్ అసహనం.. అందుకే..**

భారత్‌పై 25% సుంకాలు విధిస్తామంటూ ట్రంప్ చేసిన ప్రకటన వెనుక కారణం ఏంటో వైట్‌హౌస్ ఆర్థిక సలహాదారు, అమెరికా నేషనల్ ఎకనమిక్ కౌన్సిల్ డైరెక్టర్ కెవిన్ హాసెట్ బయటపెట్టారు. ఏప్రిల్‌లో ట్రంప్ సుంకాల ప్రకటన చేసిన నాటి నుంచీ.. ఇండియాఅమెరికా మధ్య వాణిజ్య ఒప్పందానికి సంబంధించి జరుగుతున్న చర్చలు ఎటూ తెగట్లేదు. దీనిపై ట్రంప్ అసహనంతో ఉన్నారని.. 25వ సుంకాల విధింపును ఆయన ఒక పరిష్కారంగా చూస్తున్నారని.. ఈ టారిఫ్ ద్వారా భారత్‌పై ఒత్తిడి పెంచి అమెరికా ప్రజలకు మేలు చేసేలా ఒప్పందం కుదుర్చుకోవచ్చని ఆయన భావిస్తున్నట్టు హాసెట్ వెల్లడించారు.

మొదటి పేజీ తరువాయి

## ట్రంప్‌తో మోదీ స్నేహం ఇంతేనా..?: సుంకాలపై మండిపడ్డ విపక్షాలు



ఈ నేపథ్యంలో ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించిన విపక్షాలు.. అమెరికా అధ్యక్షుడితో మోదీ స్నేహం ఇంతేనా అంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరాయి.
కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్ మాట్లాడుతూ.."భారత ఉత్పత్తులపై 25శాతం సుంకాలతోపాటు పెనాల్టీ విధించడం మోదీతోపాటు భారత్‌కు ఎదురుదెబ్బ. పొగడ్తలతో చివరకు సుంకాలు మిగిలాయి. వీరిద్దరి మధ్య స్నేహం ఇంతేనా. హౌడీ మోదీ, నమస్తే ట్రంప్ కార్యక్రమాలతో ప్రయోజనం ఏమీ లేదు. భారత్‌అమెరికా స్నేహం నుంచి మనకేం లభించింది. ఆపరేషన్ సిందూర్‌ను ఆపానని ట్రంప్ 30 సార్లు అన్నారు. ఈ చర్య అమెరికా మనల్ని బ్లాక్‌మెయిల్ చేయడమే. వీటికి ప్రధాని మోదీ భయపడకూడదు. ఇందిరా గాంధీని స్ఫూర్తిగా తీసుకొని అమెరికాకు దీటుగా సమాధానం ఇవ్వాలి" అని జైరాం రమేశ్ స్పష్టం చేశారు.
టీఎంసీ ఎంపీ డెరెక్ ఒబ్రియాన్ స్పందిస్తూ.."56 అనేది 25 కన్నా తక్కువ. ట్రంప్ 25శాతంపై (ప్రధాని మోదీ) ఇప్పుడేం చెబుతారు" అని పేర్కొంటూ గతంలో ట్రంప్‌నకు మద్దతుగా ప్రచారం చేసిన మోదీ వ్యాఖ్యలతో కూడిన ఓ వీడియోను పోస్టు చేశారు. ఈసారి మళ్లీ ట్రంప్ ప్రభుత్వమే వస్తుందని అందులో ఉన్న విషయాన్ని మళ్లీ ప్రస్తావించారు.
ఇదే అంశంపై రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) ఎంపీ మనోజ్ ఝా పార్లమెంటు కాంప్లెక్సులో మీడియాతో మాట్లాడారు. మన ప్రభుత్వం లోపాలను అంగీకరించాలని, ప్రతి ఒక్కరిని విశ్వాసంలోకి తీసుకోవాలని అన్నారు. ఇక ట్రంప్ నిర్ణయం భారత్‌కు మరో అవమానకర విషయమని సీపీఐ ఎంపీ సందోష్ కుమార్ పేర్కొన్నారు. ఈ విషయంపై ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని డీఎంకే నేత తిరుచ్చి శివ డిమాండ్ చేశారు. రష్యా నుంచి సైనిక పరికరాలు, చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌కు శిక్ష విధిస్తున్నారని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జనరల్ సెక్రటరీ దీపాంకర్ భట్టాచార్య సోషల్ మీడియాలో పేర్కొన్నారు. భారత ప్రభుత్వానికి ట్రంప్ బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇది ఆమోదయోగ్యం కాదని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అభిప్రాయపడ్డారు. మరో కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ట్రంప్ తనకు మంచి మిత్రుడని మోదీ చెబుతున్నప్పటికీ అమెరికా అధ్యక్షుడి ఎజెండా మాత్రం స్పష్టంగా తెలిసిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వాణిజ్యం ఒప్పందంపై చర్చలు కొనసాగించాలని డిమాండ్ చేశారు.

## ఎమ్మెల్యేల ఫిరాయింపుపై నేడు సుప్రీం తీర్పు



**ఈ కబురు, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసులో సుప్రీం కోర్టు గురువారం తుది తీర్పు వెలువరించనుంది. ఈ ఫిరాయింపుల కేసుపై చివరిసారిగా ఏప్రిల్ 3న జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టైన్ జార్జ్ మసీలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఇప్పుడు జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నారు. ఈకేసుపై సీజే ధర్మాసనం కీలక తీర్పు ఇవ్వనున్న నేపథ్యంలో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్, కడియం శ్రీహరి పార్టీ ఫిరాయించారని పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్ సుప్రీం కోర్టులో జనవరి 15న స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు.**

**అదేరోజు ఎమ్మెల్యేలు పరిగి శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కాలే యాదయ్య, టి.ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, ఎం.సంజయ్ కుమార్ పార్టీ ఫిరాయించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్, జగదీశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, చింత ప్రభాకర్, కల్వకుంట్ల సంజయ్ రిట్ పిటిషన్ వేశారు. ఆ తర్వాత వాదనలు జరుగుతుండగానే మార్చి 18న బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మరో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. దానం నాగేందర్‌ను ప్రతివాదిగా చేర్చారు. ఆ పిటిషన్లంటినీ కలిపి విచారించిన ధర్మాసనం ఏప్రిల్ 3న తీర్పును ఎనిమిది వారాలకు రిజర్వ్ చేసింది. ధర్మాసనంలో సీజేపాటు జస్టిస్ వినోద్ చంద్రన్ ఉన్నారు.**

మొదటి పేజీ తరువాయి

## నింగిలోకి నిసార్



తొలి మూడు దశలనూ సునాయాసంగా పూర్తిచేసుకుంది. ఈ క్రమంలో 747 కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత 2,392 కిలోల బరువున్న ఉపగ్రహాన్ని కక్ష్యలో విడిచిపెట్టింది. ఈ వెంటనే మిషన్ కంట్రోల్ సెంటర్‌లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. అక్కడి నుంచే రాకెట్ గమనాన్ని పర్యవేక్షిస్తున్న ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ జీఎస్ఎల్వీఎఫ్16 ప్రయోగం విజయవంతమైందని ప్రకటించారు. సహచర శాస్త్రవేత్తలను ఆలింగనం చేసుకొని ఆనందం పంచుకున్నారు. ఈ ఏడాది మేలో పీఎస్ఎల్వీసీ61 రాకెట్ ప్రయోగం విఫలమైన నేపథ్యంలో.. ఈ విజయం ఇస్రోకు భారీ ఉత్సాహాన్నిచ్చింది. ఇస్రోనాసా సంయుక్త మిషన్ కావడంతో ఇస్రోతో పాటు అమెరికా నుంచి నాసా శాస్త్రవేత్తలు కూడా షార్‌కు చేరుకుని ప్రయోగాన్ని పరిశీలించారు.

**తొలి సిగ్నల్స్ అందాయ్...**

విజయవంతంగా కక్ష్యలోకి చేరిన నిసార్ ఉపగ్రహం అక్కడ స్థిరంగా ఉన్నట్లు బెంగళూరులోని హసన్ మాస్టర్ కంట్రోల్ సెంటర్ గ్రౌండ్ స్టేషన్‌కు సిగ్నల్స్ అందాయి. ఇస్రో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నారాయణన్‌కు ఇది మూడో ప్రయోగం. తొలి రెండు ప్రయోగాలూ విఫలం కావడంతో దీని విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. కాగా, నాసాఇస్రో సంయుక్తంగా అభివృద్ధి చేయడంతో దీనికి 'నిసార్' (నాసాఇస్రో సింథటిక్ అపార్చర్ రాడార్) అని పేరు పెట్టారు. దీనికోసం రూ. 13వేల కోట్లకుపైగా వెచ్చించినట్టు అంచనా.

**పల్లీలు తింటూ.. ప్రయోగాన్ని వీక్షిస్తూ..**

నిసార్ ప్రయోగ సమయంలో శ్రీహరికోటలోని మిషన్ కంట్రోల్ సెంటర్‌లో నాసా శాస్త్రవేత్తలు పల్లీలు తింటూ కనిపించారు. ప్రయోగాన్ని పరిశీలిస్తున్న సమయంలో వారి చేతుల్లో చిన్న డబ్బాలు కనిపించాయి. రాకెట్ గమనాన్ని వీక్షిస్తున్నంతసేపూ వాళ్లు అందులోని పల్లీలు పంచుకుని తింటూ ఉన్నారు. దీనిపై ఇస్రో పూర్వ ఉద్యోగిని ప్రశ్నించగా.. 'ప్రతి ప్రయోగ సమయంలోనూ వాళ్లు ఇలాగే తింటారు.. ఇది వాళ్ల సెంటిమెంట్' అని చెప్పారు.

**బలపడిన ఇస్రో-నాసా బంధం**

'భూపరిశీలన ఉపగ్రహం కోసం ఇస్రోనాసా మధ్య 2014లో ఒప్పందం కుదిరింది. అప్పట్నుంచి రెండు బృందాలు నిసార్ ఉపగ్రహాన్ని అభివృద్ధి చేశారు. ఇద్దరూ కలిసి చేపడుతున్న తొలి ప్రయోగమే అయినా.. మా మధ్య బంధం మరింత బలపడింది. రాబోయే కాలంలో ఇద్దరం కలిసి మరో మూడు ప్రయోగాలు చేపట్టేందుకు ఒప్పందం చేసుకున్నాం' అని ఇస్రో చైర్మన్ నారాయణన్ అన్నారు. జీఎస్ఎల్వీఎఫ్16 ప్రయోగం విజయానంతరం ఆయన మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి మాట్లాడారు. శాస్త్రవేత్తల సమష్టి కృషితోనే నిసార్ విజయవంతమైందన్నారు. రాబోయే రోజుల్లో చంద్రయాన్4 ప్రయోగ పనులకు శ్రీకారం చుడుతున్నామన్నారు. ఈ ఏడాది చివరికి గగన్‌యాన్1 పేరుతో రోబో వ్యోమమిత్రను అంతరిక్షంలోకి పంపే ప్రయోగానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పీఎస్ఎల్వీ సిరీస్‌లో కూడా మరో నాలుగు ప్రయోగాలు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. కాగా, ఇస్రో తమకు చక్కని సహకారం అందించినట్లు నాసా శాస్త్రవేత్తలు తెలిపారు.

**ఇస్రోకు సీఎం చంద్రబాబు అభినందనలు**

ఇస్రోనాసా నిసార్ ఉపగ్రహ ప్రయోగం విజయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తంచేశారు. ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. ఈ ప్రయోగం విజయవంతం కావడం తెలుగువారందరికీ గర్వకారణమని అన్నారు. నిసార్ ప్రయోగం విజయంతో అంతరిక్ష రంగంలో భారత్ మరో ముందడుగు వేసినట్లయిందని మంత్రి సత్యకుమార్ తెలిపారు.

**నిసార్ విశేషాలు**

ఉమ్మడిగా భూపరిశీలన ఉపగ్రహ మిషన్‌ను ప్రారంభించేందుకు నాసా, ఇస్రో 2014 సెప్టెంబరులో ఒప్పందం చేసుకున్నాయి. నాసాఇస్రో మధ్య కుదిరిన తొలి భారీ ఒప్పందమిది. భూమిపై పొరల్లో ఒక్క సెంటీమీటరు మార్పులు సంభవించినా గుర్తించేందుకు వీలుగా దీనిలో డబుల్ ఎల్, ఎస్‌బ్యాండ్ రాడార్ ఫ్రీక్వెన్సీలను ఉపయోగించారు. ఈ రాడార్లు పగలు, రాత్రి మేఘాలు, పొగ, వర్షం, పొగమంచులోనూ స్పష్టంగా ఫొటోలు తీసి పంపగలవు.
సైన్స్ డేటా కోసం ఎల్‌బ్యాండ్ సింథటిక్ అపార్చర్ రాడార్, జీపీఎస్ రిసీవర్లను నాసా అందించగా.. ఉపగ్రహం, ఎస్‌బ్యాండ్ రాడార్, ప్రయోగానికి అవసరమైన జీఎస్ఎల్వీఎఫ్16 రాకెట్‌ను ఇస్రో సమకూర్చింది.
భూకంపాలు, అగ్నిపర్వతాల పేలుళ్లు, కొండచరియలు, పర్వత ప్రాంతాల్లో మంచు చరియలు విరిగిపడే పరిస్థితులను ముందే గుర్తిస్తుంది.
నిసార్ భూమిపై, సముద్రాల్లో మంచు పరిస్థితి ఎలా ఉంది.. ఎంత మందంలో ఉంది? ఆ మంచు కరిగి నీరుగా మారే అవకాశాలను కచ్చితత్వంతో గుర్తిస్తుంది. భూమిని, మంచును 3డీలో చూపిస్తుంది. ఇది 12 రోజుల వ్యవధిలో భూమి మొత్తాన్నీ స్కాన్ చేస్తుంది.
అడవులు, పంటల విస్తీర్ణం, పచ్చదనంలో తేడా లు, నేల తేమ, నీటి వనరులు, తేడాలను గుర్తిస్తుంది.
నిసార్ డేటాతో ప్రభుత్వాలు ప్రకృతి విపత్తులు, ప్రమాదాలను అంచనావేసి తగుజాగ్రత్తలు తీసుకోవచ్చు.
ఫ జీఎస్ఎల్వీఎఫ్16 ద్వారా ఇస్రో సూర్య సమకాలిక కక్ష్యలోకి ఒక ఉపగ్రహాన్ని ప్రయోగించడం ఇదే తొలిసారి. శ్రీహరికోట నుంచి ఇస్రోకు ఇది 102వ ప్రయోగం.

మొదటి పేజీ తరువాయి

## ఉచితాల కోసం కొత్త డిస్కమ్



అధిక వడ్డీ రుణాలతో డిస్కమ్‌లు డీలా..
విద్యుత్ రంగంలో సంస్కరణలు తప్పనిసరి అని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్ర విద్యుత్ విభాగాన్ని ప్రక్షాళన చేసేందుకు అవసరమైన సంస్కరణలు అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందులో భాగంగానే ప్రస్తుతమున్న సదరన్, నార్తర్న్ డిస్కమ్‌లకు అదనంగా మరో డిస్కమ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్త డిస్కమ్ పరిధిలోకి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్ పథకాలన్నీ తీసుకు రావడం వల్ల ప్రస్తుతం ఉన్న డిస్కమ్‌ల పనితీరు మెరుగుపడుతుందని వివరించారు. డిస్కమ్‌ల పునర్వ్యవస్థీకరణతో వాటిపై ఉన్న రుణ భారం కూడా తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. పది శాతం వడ్డీతో తీసుకున్న రుణాలతో డిస్కమ్‌లు డీలా పడ్డాయని అన్నారు.

**స్కూళ్లు, సర్కారు కార్యాలయాలకు సౌర విద్యుత్**

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ విద్యుత్ వినియోగాన్ని అందుబాటులోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. జిల్లాల వారీగా అనువైన భవనాలను గుర్తించే బాధ్యతను ఆయా జిల్లాల కలెక్టర్లకు అప్పగించాలన్నారు. రాష్ట్ర సచివాలయానికి కూడా సౌర విద్యుత్ అందించాలని, వెంటనే ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎండాకాలంలో సచివాలయంలో వాహనాల పార్కింగ్ ఇబ్బందిగా మారిన నేపథ్యంలో సోలార్ రూఫ్ టాప్ షెడ్లు ఏర్పాటు చేయాలని చెప్పారు.

**2.10 లక్షల మంది ఎస్టీ రైతులకు లబ్ధి చేకూర్చాలి**

ఇందిర సోలార్ గిరి జల వికాసం పథకం రాష్ట్రంలోని అన్ని గిరిజన, ఆదివాసీ తండాలు, ఏజెన్సీ ఏరియాల్లో యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మూడేళ్లలో 2.10 లక్షల మంది ఎస్టీ రైతులకు ఈ పథకం వర్తింపజేయాలని, 6 లక్షల ఎకరాలకు సౌర విద్యుత్ పంపుసెట్లను అందించాలని చెప్పారు.

## ఏపీలో మైక్రోసాఫ్ట్ ఎక్స్‌పీరియన్స్ జోన్ ఏర్పాటు చేయాలి: మంత్రి లోకేశ్




ఈ కబురు ,అమరావతి: జనరేటివ్ ఏఐ ఆధారిత పరిష్కారాలను కనుగొని సమన్వయం చేయడానికి ఏపీలో మైక్రోసాఫ్ట్ ఎక్స్‌పీరియన్స్ జోన్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ ఆ సంస్థ ప్రతినిధుల్ని కోరారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీ టెక్‌పార్క్‌లో అజూర్ ఓపెన్ ఏఐ సర్వీస్, మైక్రోసాఫ్ట్ కోపైలట్‌ను ఉపయోగించి పరిష్కారాలను అన్వేషించేందుకు మైక్రోసాఫ్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఆధ్వర్యంలో 2026లో హ్యాకథాన్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి అవసరమైన సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. సింగపూర్ పర్యటనలో ఉన్న లోకేశ్ నేతృత్వంలోని బృందం.. మైక్రోసాఫ్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ గవర్నమెంట్ ఎఫైర్స్ హెడ్ మార్కస్ లోహ్, సెలా హెడ్ జాస్మిన్ బేగం, సీటీవో మార్క్ సౌజాలతో లోకేశ్ భేటీ అయ్యారు. భారత్‌లో అతిపెద్ద నైపుణ్యం కలిగిన ఐటీ నిపుణుల సమూహాల్లో ఏపీ ఒకటని చెప్పారు. అమెరికాలో భారతీయ ఐటీ శ్రామికశక్తిలో 25 శాతం కంటే ఎక్కువ మంది తెలుగువారే ఉన్నారన్నారు. మైక్రోసాఫ్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ భాగస్వామ్యంతో జనరేటివ్ ఏఐ, హైబ్రిడ్ క్లౌడ్, మైక్రోసాఫ్ట్ ఉత్పత్తులలో నైపుణ్యం కలిగిన ఐటీ వర్క్‌ఫోర్స్‌ను అభివృద్ధి చేయడానికి ఏపీలోని టాలెంట్ పూల్‌ను ఉపయోగించుకోవాలని కోరారు. అనంతరం లోకేశ్ బృందం ఇన్ఫినియన్ సెమీ కండక్టర్స్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను సందర్శించింది. ఆ సంస్థ ప్రెసిడెంట్ &ఎండీ సీఎస్ చువాతో సమావేశమైంది. ఏపీలో ఈఎంసీలు, పారిశ్రామిక పార్కుల్లో సెమీకండక్టర్ల తయారీకి అనుబంధంగా ప్యాకేజింగ్, టెస్టింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేశ్ కోరారు. ఈవీ తయారీ యూనిట్లకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సాహకాలు అందిస్తోందని వివరించారు.

## ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు బార్క్ లే సుముఖత

మొదటి పేజీ తరువాయి



ఈ కబురు: తమ సంస్థ నుంచి పెట్టుబడులు పెట్టేందుకు ఏపీని ప్రాధాన్యత కలిగిన రాష్ట్రంగా పరిగణిస్తామని కెపిటాల్యాండ్ ఇన్వెస్ట్‌మెంట్ (ఇండియా) ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబు బృందానికి హామీ ఇచ్చారు. సింగపూర్ పర్యటనలో భాగంగా నాలుగో రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు కెపిటాల్యాండ్ ఇన్వెస్ట్‌మెంట్ (ఇండియా), మందాయ్ వైల్డ్ లైఫ్ గ్రూప్, సుమితోమో మిత్సుయ్ బ్యాంకింగ్ కార్పొరేషన్, టెమ్‌సెక్ హోల్డింగ్స్ వంటి సంస్థల ప్రతినిధులతో వేర్వేరుగా భేటీ అయ్యారు. రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు, ఇండస్ట్రియల్ పార్కులు, డేటా సెంటర్లు, గ్రీన్ బిల్డింగ్స్, డిజిటల్ టౌన్‌షిప్స్ వంటి అంశాలపై కెపిటాల్యాండ్ ఇన్వెస్ట్‌మెంట్ (ఇండియా) ప్రతినిధులు సంజీవ్ దాస్ గుప్తా, గౌరిశంకర్ నాగభూషణంలతో చర్చించారు. అమరావతి, విశాఖ, తిరుపతి వంటి నగరాల్లో ఐటీ పార్కుల ఏర్పాటుకు, ప్లగ్ అండ్ ప్లే సదుపాయాలతో కూడిన వర్క్ స్టేషన్ల ఏర్పాటుకు అవకాశం ఉందని వారికి వివరించారు. వైల్డ్ లైఫ్ పార్కులు, ఎకో టూరిజం, బయో డైవర్సిటీ కాంప్లెక్స్‌లు, వైల్డ్ లైఫ్ ఎక్స్‌పీరియెన్స్ జోన్ల ఏర్పాటు వంటి అంశాలపై మందాయ్ వైల్డ్ లైఫ్ గ్రూప్ ప్రతినిధి మైక్ బార్క్ లేతో సీఎం మాట్లాడారు. రాష్ట్రంలో ఆయా రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు బార్క్ లే సుముఖత వ్యక్తం చేశారు. పరిశ్రమలు, మౌలిక వసతులు, గ్రీన్ ఎనర్జీ, నగరాభివృద్ధి వంటి రంగాల్లో పెట్టుబడులపై జపాన్‌కు చెందిన సుమితోమో మిత్సుయ్ బ్యాంకింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజీవ్ కన్నన్‌తో ముఖ్యమంత్రి బృందం సమాలోచనలు జరిపింది. వివిధ ప్రాజెక్టుల్లో అవసరమైన ఆర్థిక భాగస్వామ్యంపై చర్చించారు. ఫైనాన్స్, ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ లెండింగ్, క్లీన్ ఎనర్జీ ఫైనాన్సింగ్ వంటి రంగాలపై తాము ఆసక్తితో ఉన్నామని ఎస్ఎంబీసీ ప్రతినిధులు ప్రకటించారు.

మొదటి పేజీ తరువాయి

# రేపు ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్ గార్ యోజన పథకం ప్రారంభం



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న కమిషనర్ విశాల్ అగర్వాల్

**మూడున్నర కోట్ల కొత్త ఉద్యోగాలను సృష్టించడమే లక్ష్యం : విశాల్ అగర్వాల్**

ఈకబురు, శేరిలింగంపల్లి : కొత్త ఉద్యోగాలను సృష్టించడం, ఉపాధిని పెంచడం, అన్నీ రంగాల్లో సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్ గార్ యోజన పేరుతో కొత్త పథకం తీసుకువచ్చింది. ఆగస్టు 1వ తేదిన నుండి ప్రారంభం కానున్న ఈ పథకంపై మాదాపూర్ నేషనల్ అకాడమీ ఆఫ్ కన్ స్ట్రక్షన్ క్యాంపస్‌లోని పిఎఫ్ కార్యాలయంలో సంగారెడ్డి జిల్లా రిజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ విశాల్ అగర్వాల్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ విశాల్ అగర్వాల్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు ఆగస్టు 1వ తేది నుండి ప్రావిడెంట్ ఫండ్‌లో ప్రధానమంత్రి వికసిత్ రోజ్ గార్ యోజన పేరుతో కొత్త పథకం ప్రవేశ పెడుతుందన్నారు. ఈ పథకం ద్వారా దేశ వ్యాప్తంగా 3.5 కోట్ల ఉద్యోగాలు సృష్టించడమే ముఖ్య లక్ష్యం అన్నారు. ఆగస్టు 1వ తేది నుండి 2027 జులై 31వ తేది వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఈ పథకాన్ని పార్ట్ ఏ, పార్ట్ బిగా విడదీశామన్నారు. పార్ట్ - ఏలో మొదటిసారి ఉద్యోగాల్లో చేరిన వారికి ఈపిఎఫ్ఓ ద్వారా రెండు ఇన్‌స్టాల్‌మెంట్లలో రూ. 15వేలు చెల్లిస్తామని, మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ 6 నెలల తర్వాత, రెండవ ఇన్‌స్టాల్‌మెంట్ 12 నెలలు పాటు ఉద్యోగం పూర్తి చేసిన తర్వాత ఫైనాన్షియల్ లిట్రసీ ప్రోగ్రాం కంప్లీట్ చేసాక ఉద్యోగుల సేవింగ్స్ అకౌంట్స్‌లో జమా చేస్తామన్నారు. పార్ట్ -బిలో ఉద్యోగాలను సృష్టించడానికి యజమానులను ప్రోత్సహించడం కోసం ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. 6 నెలల వ్యవధిలో 50 కంటే తక్కువ మంది ఉద్యోగులు ఉన్న పరిశ్రమలు కనీసం ఇద్దరు ఉద్యోగులను, 50 కంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న పరిశ్రమలు 5 మంది కంటే ఎక్కువ ఉద్యోగులను నియమించుకుకోవాలి. వీరికి రెండు సంవత్సరాల పాటు నెలకు రూ.3వేల చొప్పున ఈ పథకం కింద డబ్బులు చెల్లిస్తారని, అదే తయారీ రంగ పరిశ్రమలకు నాలుగు సంవత్సరాల పాటు ఈ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. ఉద్యోగుల నెల సంపాదన రూ. లక్ష వరకు ఉండాలని తెలిపారు. ఈ అవకాశాలను నూతన ఉద్యోగులు, పరిశ్రమల యజమానులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రిజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్లు గ్రేడ్ 2 దుర్గా ప్రసాద్, డిజికె పావని, దిలీప్‌మీనా, ఏఏ అనుషారెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఐఎఫ్ బి లో ముగిసిన వర్క్ షాప్

**సర్టిఫికెట్లు ప్రదానం చేసిన డైరెక్టర్ వెంకట్ రెడ్డి**



శిక్షణ పొందిన రైతుకు సర్టిఫికెట్ అందిస్తున్న డైరెక్టర్ వెంకట్ రెడ్డి

ఈ-కబురు, హైదరాబాద్ : నగరంలోని దూలపల్లిలో గల ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ బయోడైవర్సిటీ సెంటర్లో "క్వాలిటీ ప్లాంటింగ్ మెటీరియల్ ప్రొడక్షన్ ఇన్ ఫారెస్ట్ నర్సరీ" అనే అంశంపై మూడు రోజులపాటు నిర్వహించిన వర్క్ షాప్ బుధవారంతో ముగిసింది. మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్మెంట్, ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్ (ఎంఓఈఎఫ్ సిసి) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు ఐ ఎఫ్ బి డైరెక్టర్, ఐఎఫ్ఎస్ ఇ.వెంకట్ రెడ్డి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము ఎంతోకాలంగా ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన రైతులు సైతం తమ శిక్షణ తరగతుల్లో పాల్గొని అటవీ జాతి మొక్కలపై పూర్తి అవగాహన పెంచుకుంటున్నారన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన రైతులు తాము సొంతంగా నర్సరీలు ఏర్పాటు చేసుకొని నాణ్యమైన అటవీ జాతి మొక్కలను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. కాగితం, ఫర్నిచర్, ప్లైవుడ్ పరిశ్రమలకు కలప అవసరం చాలా ఉందని ఇందుకోసం అత్యంత వేగంగా పెరిగే కలప జాతులను తాము ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న అవసరాలకు ఐదు శాతం కూడా అడవుల నుంచి కలప అందడం లేదని కేవలం ఆగ్రో ఫారెస్ట్రీ మాత్రమే ఈ అవసరాన్ని తీర్చగలుగుతుందన్నారు. నేడు హర్యానా పంజాబ్ వంటి రాష్ట్రాలు కేవలం ఆగ్రో ఫారెస్ట్ ద్వారానే దేశం యొక్క అవసరాలను తీరుస్తున్న విషయాన్ని మన రైతులు గమనించాలన్నారు. తెలంగాణ భూములు అటవీ జాతి మొక్కలకు ఎంతో అనుకూలంగా ఉన్నాయని, రైతులు ముందుకు వస్తే ఇక్కడే కలప ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు అవుతాయన్నారు. ఈ సందర్భంగా శిక్షణ అందుకున్న రైతులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ అటవీ జాతులు, పండ్ల మొక్కల పెంపకంలో తాము పొందిన శిక్షణ అత్యంత విలువైనదని హర్షం వ్యక్తం చేశారు. ఈ రంగంలో పనిచేస్తున్న సీనియర్ సైంటిస్టులతో తమకు శిక్షణ తరగతులు నిర్వహించడంతోపాటు నర్సరీ నిర్వహణ అంటు మొక్కల తయారీ, చీడపీడల నివారణ వంటి అంశాలపై అత్యుత్తమ శిక్షణను అందించారన్నారు. తమ వద్ద ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా భోజన వసతులతో పాటు ప్రయాణ చార్జీలు సైతం అందించారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సైంటిస్టులు డాక్టర్ స్వప్నెందు పట్నాయక్, డాక్టర్ పంకజ్ సింగ్, డాక్టర్ కే.శివ ప్రసాద్ తోపాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# మోదీకి ధైర్యం లేదు



న్యూఢిల్లీ, ఈ కబురు: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబుతున్నదంతా అబద్ధమని ప్రధాన మంత్రి మోదీ చెప్పలేకపోతున్నారని కాంగ్రెస్ విమర్శించింది. భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణలో తాను కీలక పాత్ర పోషించానని ట్రంప్ ఇప్పటికి దాదాపు 30సార్లు ప్రకటించుకోవడంపై మోదీ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేసింది. ట్రంప్ అబద్ధం చెబుతున్నారని చెప్పే ధైర్యం మోదీకి లేదని ఎద్దేవా చేసింది. కాల్పుల విరమణ విషయంలో తన పాత్ర గురించి ట్రంప్ అబద్ధం చెబుతున్నారని మోదీ చెప్పలేరని, అలా చేస్తే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిజాన్ని బయట పెడతారని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ విమర్శించారు. 'ఒకవేళ ట్రంప్ చెప్పేది అబద్ధమని మోదీ చెబితే.. నిజం ఏమిటో ఆయనే బహిరంగంగా చెబుతారు. అందుకే ప్రధాని ఏమీ చెప్పలేకపోతున్నారు' అని రాహుల్ వ్యాఖ్యానించారు. ట్రంప్ అబద్ధం చెబుతున్నారని చెప్పే ధైర్యం మోదీకి లేదని, ఈ వ్యవహారం మొత్తం అనుమానాస్పదంగా ఉందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే అన్నారు. ఇదిలా ఉండగా, భారత తొలి ప్రధాని నెహ్రూను ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో విమర్శించడంపై కాంగ్రెస్ మండిపడింది. వారి వైఫల్యాలకు సమాధానం చెప్పలేక దృష్టి మళ్లింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించింది. నెహ్రూ విషయంలో మోదీ, అమిత్ షా ఇద్దరూ ఓసీడీ (అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్) సమస్యతో బాధపడుతున్నారన్నవిషయం లోక్‌సభలో మరోసారి నిరూపితమైందని జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు.

# దేవాలయాల్లో దొంగతనాల నిందితులు అరెస్ట్..



**రూ.2 లక్షల విలువైన బంగారు, వెండి అభరణాలు, బైక్ స్వాధీనం**

ఈకబురు, శేరిలింగంపల్లి : చందానగర్, మియపూర్ పరిధిలోని దేవాలయాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను చందానగర్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుండి బంగారం, వెండి అభరణాలతో పాటు ఒక బైకును స్వాధీనం చేసుకున్నారు. చందానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 25వ తేదిన చందానగర్ హుడా కాలనీలోని సాయిబాబా దేవాలయం, అదే రోజు మియాపూర్ గ్రామంలోని సాయిబాబా దేవాలయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ తాళాలు పగులగొట్టి హుండీలను ధ్వంసం చేసి అందులోని నగదు, బంగారు, వెండి అభరణాలను దొంగలించారు. అంతకు ముందు జులై 7వ తేదిన చందానగర్ గంగారం గ్రామంలోని ఆంజనేయస్వామి, శ్రీరాములవారి దేవాలయంలో చోరి జరిగింది. నెల రోజుల వ్యవధిలోనే చందానగర్ పోలీస్ స్టేషన్‌లో రెండు దేవాలయాల్లో చోరీలు జరగడంతో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సిసి కెమెరాల ఆధారంగా చందానగర్, మియాపూర్‌లోని దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడింది గాజులరామారం రోడామేస్త్రీనగర్‌కు చెందిన శుభమ్‌సింగ్, మహమ్మద్ అన్వర్, ధర్మేష్‌కున్వర్‌గా గుర్తించారు. బుధవారం ఉదయం వీరిని గాజులరామారంలో అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుండి రెండు లక్షల విలువైన బంగారు, వెండి అభరణాలను, ఒక బైకు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. వీరిలో ధర్మేష్ విద్యార్థి కాగా, శుభమ్ సింగ్ పాత నేరస్థుడిగా పోలీసులు గుర్తించారు. మరో నిందితుడు మొదటిసారిగా దొంగతనం చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# సునామీ ప్రకంపనలు



టోక్యో/మాస్కో/వాషింగ్టన్/న్యూఢిల్లీ ,ఈ కబురు : రష్యా సమీప పసిఫిక్ మహాసముద్రగర్భంలో జనించిన ప్రళయ భీకర సునామీ రెప్పపాటులో ఆ సముద్ర తీర దేశాలను చివురుటాకులా వణికించింది. సముద్రగర్భ భూకంపం ధాటికి ఉద్భవించిన రాకాసి అలలు క్రూరంగా తీరపట్టణాలపై విరుచుకుపడ్డాయి. రిక్టర్‌స్కేల్‌పై 8.8 తీవ్రతతో మొదలైన భూ ప్రకంపనలు తీర దేశాల్లోని కోట్లాది మంది ప్రజలను ప్రాణభయంతో పరుగులు పెట్టించాయి. భవనాలు పేకమేడల్లా కూలుతాయన్న భయంతో ఇప్పటికే లక్షలాది మంది తీరప్రాంత వాసులు సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. ఆగకుండా ప్రకంపనలు ఉధృతస్థాయిలో రావడంతో భవనాలు కొన్ని నిమిషాలపాటు ఊగిపోయాయి. తీర ప్రాంతాల్లోకి సముద్రపునీరు ఊహించనంతగా కొట్టుకొచ్చింది. రష్యా తూర్పున సుదూరంగా ఉన్న కామ్‌చట్కా ద్వీపకల్పంలోని పెట్రోపావ్లోవ్స్క్-కామ్చాట్‌స్కీ నగర సమీపంలో ఈ భూకంపం సంభవించింది. స్థానిక కాలమానం ప్రకారం రష్యాలో బుధవారం ఉదయం 11.24 గంటలకు పసిఫిక్ మహాసముద్రగర్భంలో 21 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించామని అమెరికా జియాలజికల్ సర్వే సంస్థ ప్రకటించింది. కామ్‌చట్కా పరిధిలో కొన్ని చోట్ల అలలు ఏకంగా 20 అడుగుల ఎత్తులో దూసుకొచ్చి తీరంలో పెను విలయం సృష్టించాయని రష్యా సోషనాలజీ ఇన్‌స్టిట్యూట్ ప్రకటించింది. సివిరో కురిల్స్క్ తీరపట్టణంపై 14 అడుగుల ఎత్తైన రాకాసి అలలు విరుచుకుపడ్డాయి. తీరంలోని నిర్మాణాలను సర్వనాశనం చేశాయి. రష్యా మొదలు జపాన్, అమెరికా, హవాయి, న్యూజిలాండ్, చిలీ, కొలంబియా దాకా సమీపంలోని అన్ని దేశాలను సునామీ ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. ఆయా దేశాల ప్రభుత్వాలు ఇచ్చిన సునామీ హెచ్చరికలతో తీరప్రాంతాల్లోని ప్రజలంతా ప్రాణభయంతో ఎత్తైన ప్రదేశాలు, బీచ్‌లకు దూరంగా ఉన్న పచ్చికబయళ్లకు పరుగులు తీశారు. ప్రకంపనలకు తాము ఉంటున్న భవనాలు ఊగిపోవడంతో కొందరు భయంతో కిటికీల నుంచి బయటకు దూకి గాయాలపాలయ్యారు. అమెరికాలోని హోనలూనూ సిటీలో జనం ఒక్కసారిగా కార్లతో వేరే చోట్లకు తరలిపోవడంతో రహదారులన్నీ ట్రాఫిక్‌తో స్తంభించిపోయాయి. ద్వీప రాష్ట్రం హవాయిలో పలుచోట్ల సునామీ సైరన్లు మోగించారు. భూ ప్రకంపనలు జపాన్ తీరాలను తాకినా ఆ దేశంలోని అణువిద్యుత్ కేంద్రాలకు ఎలాంటి ప్రమాదం సంభవించలేదని అంతర్జాతీయ అణుఇంధన సంస్థ స్పష్టంచేసింది. సాధారణంగా భూకంపం తర్వాత వచ్చే ప్రకంపనల తీవ్రత అత్యల్పంగా ఉంటుంది. కానీబుధవారం సంభవించిన పెను భూకంపం ధాటికి ఆ తర్వాత వచ్చే ప్రకంపనలు సైతం 6.9 తీవ్రతతో విస్తరించడం గమనార్హం. సునామీ తర్వాత పలు దేశాల బీచ్‌లు నిర్మానుష్యంగా మారాయి.

**1900 ఏడాది నుంచి సంభవించిన భారీ భూకంపాలు**

**1960 చిలీ దేశంలోని బియబియో (రిక్టర్ స్కేల్‌పై 9.5 తీవ్రత)**

**1964 అమెరికాలోని అలాస్కా(రిక్టర్ స్కేల్‌పై 9.2 తీవ్రత)**

**2011 జపాన్‌లోని తొహోకూ (రిక్టర్ స్కేల్‌పై 9.1 తీవ్రత)**

**2004 ఇండోనేసియాలోని సుమత్రా (రిక్టర్ స్కేల్‌పై 9.1 తీవ్రత)**

**1952 రష్యాలోని కామ్‌చట్కా (రిక్టర్ స్కేల్‌పై 9 తీవ్రత)**

**2025 రష్యాలోని కామ్‌చట్కా (రిక్టర్ స్కేల్‌పై 8.8 తీవ్రత)**

**2010 చిలీలోని బియోబియో (రిక్టర్ స్కేల్‌పై 8.8 తీవ్రత)**

**1906 ఈక్వెడార్‌లోని ఎస్మిరాల్డాస్ (రిక్టర్ స్కేల్‌పై 8.8 తీవ్రత)**

**1965 అమెరికాలోని అలాస్కా (రిక్టర్ స్కేల్‌పై 8.7 తీవ్రత)**

2012 ఇండోనేసియాలోని సుమత్రా (రిక్టర్ స్కేల్‌పై 8.6 తీవ్రత)

**బద్దలైన అగ్నిపర్వతం**

భూకంపం సంభవించినప్పుడే రష్యాలోని కామ్‌చట్కా పరిధిలోని కిచెవ్‌స్కయా సోప్కా అగ్నిపర్వతం బద్దలైంది. ఉత్తరార్ధ గోళంలోనే అతిపెద్ద అగ్నిపర్వతాల్లో ఒకటైన ఈ అగ్నిపర్వతం బద్దలవడంతో అందులోంచి భారీ స్థాయిలో లావా ఎగజిమ్మింది. పలు పేలుళ్లు సైతం వినిపించాయని రష్యా అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లోని జియోఫిజికల్ విభాగం ప్రకటించింది. పలు దేశాల్లో ప్రకంపనలు తీవ్రస్థాయిలో సంభవించినప్పటికీ ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. కొన్ని దేశాలు అత్యధిక స్థాయి సునామీ హెచ్చరికలు జారీచేసి తర్వాత పెనుప్రమాదం లేదని తెలిశాక ఉపసంహరించుకున్నాయి.

**అయినా సర్జరీ ఆగలేదు...**

రష్యాలోని కామ్‌చట్కా ప్రాంతంలో భూకంపం వచ్చినప్పుడే అక్కడి ఒక ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లో శస్త్ర చికిత్స జరుగుతోంది. కాళ్ల కింద నేల కదులుతున్నా వైద్యులు ఏమాత్రం జంకకుండా జాగ్రత్తగా సర్జరీ విజయవంతంగా పూర్తిచేశారు. సంబంధింత వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. ఆపరేషన్ థియేటర్‌లోని రోగి పడుకున్న స్ట్రెచర్‌ను సహాయక సిబ్బంది గట్టిగా పట్టుకోవడం, వైద్యులు సర్జరీని కొనసాగించడం ఆ వీడియోలో రికార్డయింది. దీంతో ఆపత్కాలంలోనూ వైద్యులు చూపిన వృత్తి నిబద్ధతను మెచ్చుకుంటూ పలువురు సామాజికమాధ్యమాల్లో కామెంట్లు పెట్టారు.



మొదటి పేజీ తరువాయి

# గొర్రెల కుంభకోణంలో రంగంలోకి ఈడీ



ఈ కబురు, హైదరాబాద్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన గొర్రెల పంపిణీ పథకం కుంభకోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో బుధవారం సోదాలు నిర్వహించింది. పశుసంవర్ధకశాఖ మాజీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్‌కు గతంలో ఓఎస్డీగా పనిచేసిన గుండమరాజు కల్యాణ్‌కుమార్.. రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్య పూర్వ ఎండీ సబావత్ రాంచందర్‌నాయక్.. లొలోన కంపెనీ నిర్వాహకులు మొయిదుద్దీన్, ఇక్రముద్దీన్ తదితర నిందితుల ఇళ్లు, కార్యాలయాల్లో 8 చోట్ల ఈడీ బృందాలు ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నాయి. సోదాల అనంతరం కల్యాణ్‌కుమార్‌ను ఈడీ కార్యాలయానికి తరలించి విచారించారు. సొంత కారులో కార్యాలయానికి వెళ్లిన కల్యాణ్‌కుమార్ రాత్రి వరకు అక్కడే ఉన్నారు. గొర్రెల పంపిణీ పేరిట రూ.2.01 కోట్ల మేర నిధులను పక్కదారి పట్టించినట్లు తొలుత గచ్చిబౌలి పోలీసులకు గతేడాది వచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదైంది. అనంతరం కేసును ఏసీబీ దర్యాప్తు చేసింది. రాంచందర్‌నాయక్, కల్యాణ్‌కుమార్ సహా మొత్తం 17 మందిని అరెస్ట్ చేసింది. ఈ జాబితాలో పలువురు పశుసంవర్ధకశాఖ అధికారులున్నారు. దళారులుగా వ్యవహరించిన మొయిదుద్దీన్, ఇక్రముద్దీన్ విదేశాలకు పారిపోయారు. ఈ కేసు ఆధారంగా ఈడీ గతేడాది ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్(ఈసీఐఆర్) నమోదు చేసింది. గతేడాది జూన్‌లో సమాఖ్య ఎండీకి లేఖ రాసి సమాచారం సేకరించింది. ఆ తర్వాత ఈడీ కేసులో ఎలాంటి పురోగతి కనిపించలేదు. తాజాగా ఏడాది అనంతరం సోదాలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**7 జిల్లాల్లోనే రూ.253 కోట్లు స్వాహా**

2017 నుంచి గొర్రెల పంపిణీని ప్రారంభించారు. భారాస ప్రభుత్వ హయాంలో రెండు విడతలుగా సుమారు 4.25 లక్షల యూనిట్లను పంపిణీ చేసినట్లు చూపించారు. ఇందుకోసం దాదాపు రూ.4 వేల కోట్లు మంజూరు చేశారు. అయితే కొన్ని యూనిట్లనే పంపిణీ చేసి... ఎక్కువ కొన్నట్లు చూపడం ద్వారా పెద్దఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయి. అధికారులతోపాటు దళారులు వాటాలు పంచుకుని రూ.కోట్ల సొమ్ము స్వాహా చేశారు. ఇదే అంశాన్ని కాగ్ సైతం ప్రస్తావించింది. బైకులపై గొర్రెలను తరలించినట్లు లెక్కచూపి నిధులు కొట్టేసినట్లు తేల్చింది. అప్పట్లో ఏడు జిల్లాల్లో నిర్వహించిన తనిఖీల్లోనే సుమారు రూ.253 కోట్ల మేర నిధులను స్వాహా చేసినట్లు కాగ్ గుర్తించింది.

మొదటి పేజీ తరువాయి

# మణిపూర్‌లో మరో ఆరు నెలలు రాష్ట్రపతి పాలన

**ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను ఆగస్టు 13 తర్వాతి నుంచి మరో ఆరు నెలలు పొడిగించడానికి సంబంధించిన..**

**మణిపూర్‌లో మరో ఆరు నెలలు రాష్ట్రపతి పాలన తీర్మానానికి లోక్‌సభ ఆమోదం**

న్యూఢిల్లీ, ఈ కబురు: ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను ఆగస్టు 13 తర్వాతి నుంచి మరో ఆరు నెలలు పొడిగించడానికి సంబంధించిన తీర్మానానికి బుధవారం లోక్‌సభ ఆమోదం తెలిపింది. హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ తీర్మానాన్ని లోక్‌సభలో చర్చకు ప్రవేశపెట్టారు. మణిపూర్‌లో ఫిబ్రవరి 13న రాష్ట్రపతి పాలన ను విధించగా.. ఏప్రిల్ 2న పార్లమెంట్ ఆమోదం తెలిపిందని స్పీకర్ ఓం బిర్లా పేర్కొన్నారు. రాష్ట్రపతిపాలనకు పార్లమెంట్ తెలిపిన ఆమోదం ఆరు నెలల పాటు చెల్లుబాటు అవుతుంది. ఒకవేళ రాష్ట్రపతి పాలనను మరో ఆరు నెలల పాటు పొడిగించాలంటే చట్టబద్ధమైన తీర్మానాన్ని పార్లమెంట్‌లోని ఉభయ సభలు ఆమోదం తెలపాల్సి ఉంటుంది. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించిన తర్వాతి నుంచి ఒకే ఒక మరణం చోటు చేసుకుందని కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ పేర్కొన్నారు. ఈ రాష్ట్రంలో శాంతి స్థాపనకు రాష్ట్రపతి పాలన ముఖ్యమన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు నియంత్రణలో ఉన్నాయని తెలిపారు.



# ఐటీలో కల్లోల వేళ ఇన్ఫోసిస్ చల్లని కబురు

**టీసీఎస్ లేఆఫ్‌ల ప్రకటన తర్వాత దేశ ఐటీ పరిశ్రమలో కల్లోల వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో ఆందోళనలో ఉన్న ఐటీ ఉద్యోగార్థులకు దేశీయ రెండో అతిపెద్ద ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ చల్లని కబురు చెప్పింది. ఈ ఏడాది 20,000 మంది గ్రాడ్యుయేట్లను నియమించుకోనున్నట్లు ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్ ధృవీకరించారు.**




మొదటి త్రైమాసికంలో 17,000 మందిని (స్థూల నియామకాలు) నియమించుకున్నామని, ఈ ఏడాది ఇంత 20,000 మంది కాలేజీ గ్రాడ్యుయేట్లను నియమించుకోవాలని యోచిస్తున్నట్లు ఆయన 'టైమ్స్ ఆఫ్ ఇండియా'తో చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), రీస్కిల్లింగ్‌లలో వ్యూహాత్మకంగా పెట్టుబడులు పెట్టడం ద్వారా కంపెనీ కాస్త ముందంజలో ఉందన్న పరేఖ్.. ఇప్పటి వరకు వివిధ స్థాయిల్లో 2,75,000 మంది ఉద్యోగులకు శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

పోటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) 12,000 మందికి పైగా ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ఇన్ఫోసిస్ సీఈవో నియామకాలను ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు మరే ఇతర భారతీయ ఐటీ కంపెనీ కూడా ఈ స్థాయిలో లేఆఫ్‌లను ప్రకటించలేదు.

**ఏఐ ప్రభావంపై..**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావం గురించి పరేఖ్ మాట్లాడుతూ, "కృత్రిమ మేధ లోతైన ఆటోమేషన్, అవగాహనను అందిస్తుంది. అదే సమయంలో ఉన్నత స్థాయి నైపుణ్యాలు, ప్రతిభ అవసరం" అని అన్నారు. ఉద్యోగులు,సాంకేతికత రెండింటి పట్ల దీర్ఘకాలిక నిబద్ధతను ప్రతిబింబిస్తూ ఇన్ఫోసిస్ తన శ్రామిక శక్తిని విస్తరిస్తుందని పేర్కొన్నారు.

**వేతనాల పెంపుపై..**

గత ఆర్థిక సంవత్సరం క్యూ4, క్యూ1లకు వేతనాల పెంపును కంపెనీ ఇప్పటికే పూర్తి చేసిందని పరేఖ్ తెలిపారు. "ఇప్పుడు ఈ సైకిల్ పూర్తయింది. ఎప్పటి లాగే తదుపరి రౌండ్ కోసం సమయాన్ని అంచనా వేయడం ప్రారంభించాం. మా ప్రస్తుత ప్రక్రియకు కట్టుబడి ఉంటాం. సరైన సమయంలో తదుపరి రౌండ్‌ను ప్రకటిస్తాం" అని పరేఖ్ వివరించారు.




# మళ్లీ సేమ్ డిజైన్: మోటో నుంచి జీ86 పవర్.. ధర, ఫీచర్లు ఇవే!

ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ మోటోరొలా దేశీయ మార్కెట్‌లోకి మరో కొత్త ఫోన్‌ను విడుదల చేసింది. మోటో జీ86 పవర్ 5జీ పేరిట దీన్ని లాంచ్ చేసింది. మీడియాటెక్ డైమెన్సిటీ 7400 ప్రాసెసర్, 50 ఎంపీ ప్రధాన కెమెరా, 6,720 ఎంఏహెచ్ బ్యాటరీతో తీసుకొచ్చారు. ఇటీవల కాలంలో మోటో వరుసగా విడుదల చేసిన ఫోన్ల మాదిరిగానే ఈ ఫోన్ డిజైన్ కూడా ఉండడం గమనార్హం.

మోటో జీ86 5జీ ఫోన్‌లో 6.7 అంగుళాల సూపర్ హెచ్‌డీ అమోలెడ్ డిస్‌ప్లే ఇచ్చారు. 120Hz రిఫ్రెష్ రేటుతో వస్తుంది. 4,500 నిట్స్ పీక్ బ్రైట్‌నెట్, గొరిల్లా గ్లాస్ 7i ప్రొటెక్షన్‌తో తీసుకొచ్చారు. ఆండ్రాయిడ్ 15 ఆధారిత హల్లో యూఐతో పనిచేస్తుంది. ఐపీ68+ ఐపీ69 రేటింగ్‌తో దీన్ని తీసుకొచ్చారు.

కెమెరా విషయానికొస్తే.. ఫోన్ వెనకభాగంలో 50 ఎంపీ సోనీ LYT600 ప్రధాన కెమెరా, 8 ఎంపీ అల్ట్రావైడ్ షూటర్‌ను ఇచ్చారు. 32 ఎంపీ సెల్ఫీ కెమెరా ఇచ్చారు. ఇందులో 6,720 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. ఇది 33W టర్బోపవర్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది.

మోటో జీ86 పవర్ 5జీ రెండు వేరియంట్లలో లభిస్తుంది. 8GB + 128GB వేరియంట్ ధర రూ .17,999గా నిర్ణయించారు. 8GB + 256GB వేరియంట్ ధర రూ.19,999కు లభిస్తుంది. కాస్మిక్ స్కై, గోల్డెన్ సిప్రెస్, స్పెల్‌బౌండ్ కలర్స్‌లో లభిస్తుంది. ఆగస్టు 6 నుంచి వీటి విక్రయాలు ప్రారంభమవుతాయని తెలిపింది. కంపెనీ అధికారిక వెబ్‌సైట్‌తో పాటు ఫ్లిప్‌కార్ట్ వేదికగా ఈ ఫోన్ కొనుగోలు చేయొచ్చు.

# దేశంలో ఏఐ, ఎడ్‌టెక్‌ల విస్తరణ.. కానీ..

**భారత్‌లో పూర్తిస్థాయిలో పుంజుకోని ఆయా రంగాలు**
**ప్రపంచవ్యాప్తంగా ఏఐ, ఎంఎల్ నిపుణులకు డిమాండ్**
**యువత నైపుణ్యాలపై దృష్టి సారించాలంటున్న నిపుణులు**

ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ (ఏఐ), మెషీన్ లెర్నింగ్(ఎంఎల్) నైపుణ్యాలకు డిమాండ్ ఆమాంతం పెరగడంతో అందుకు తగ్గట్టుగానే మన దేశంలో, రాష్ట్రంలో ఎడ్ టెక్ రంగం క్రమంగా గణనీయ వృద్ధిని సాధిస్తోంది. ఏఐ కేంద్రీకృత కోర్సుల విస్తరణకు విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య భాగస్వామ్యాలు ఊపందుకుంటున్నాయి. విద్యా రంగంలో, నైపుణ్యాలను పెంచుకునే విషయంలో ఏఐను ఏకీకృతం చేయడానికి ఉద్దేశించి ప్రభుత్వ కార్యక్రమాలు ఈ దిశలో ముందుకు సాగుతున్నాయి. ఏఐ, ఎడ్‌టెక్ మార్కెట్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాబోయే సంవత్సరాల్లో ఈ మార్కెట్ పరిమాణంలో గణనీయమైన పెరుగుదల ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

వివిధ పరిశ్రమల్లో ఏఐ నైపుణ్యాలకు ఆదరణ పెరగడంతో ఏఐ, ఎంఎల్ సంబంధిత రంగాల్లో నైపుణ్యం కలిగిన వృత్తి నిపుణులకు అధిక డిమాండ్ ఏర్పడుతోంది. తెలంగాణలో మరీ ముఖ్యంగా హైదరాబాద్‌లో ఏఐ, ఎడ్‌టెక్‌లకు కేంద్రంగా అనేక సంస్థలు ప్రత్యేక కోర్సులు, శిక్షణా కార్యక్రమాలను అందిస్తున్నాయి. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్ సంస్థలు, ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లు తమ ఏఐ కోర్సు కేటలాగ్‌లను విస్తరిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వపరంగానూ వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, విద్య, చలనశీలత వంటి రంగాల్లో ఏఐను ఉపయోగించడంపై దృష్టి సారిస్తోంది. ఏఐ విద్యకు ప్రోత్సాహంతోపాటు సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో ఏఐ, రొబోటిక్స్ కోర్సులను ప్రవేశపెట్టింది. పరిశ్రమ సంబంధిత ఏఐ పరిష్కారాలను అభివృద్ధి




చేయడానికి, విద్యార్థులకు ఆచరణాత్మక శిక్షణ అవకాశాలు అందించడానికి సంస్థలు పరిశ్రమలు, టెక్ కంపెనీలతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకుంటున్నాయి.

**ఉద్యోగాలున్నా నైపుణ్యాల కొరత**

కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లర్నింగ్ (ఎంఎల్)లలో ప్రావీణ్య సాధన ఎకో సిస్టమ్ పూర్తిస్థాయిలో ఇంకా మన దేశంలో ఏర్పడలేదని స్మార్ట్ స్టెప్స్ ట్రైనింగ్ అకాడమీ ఫౌండర్ నానబాల లావణ్యకుమార్ అభిప్రాయపడ్డారు. కొవిడ్ సమయంలో కంపెనీలు, ఉద్యోగులంతా క్లౌడ్ ఆధారిత టెక్నాలజీ, అప్లికేషన్లపైనే దృష్టి పెట్టారని.. కానీ అదే సమయంలో అమెరికా, చైనా మాత్రం జెనరేటివ్ ప్రీ-ట్రెయిన్డ్ ట్రాన్స్‌ఫార్మర్ (జీపీటీ)లను తయారు చేసి రేసులో ఎంతో ముందుకెళ్లిపోయాయని చెప్పారు. కానీ భారత్ మాత్రం సంప్రదాయ కోర్సులకే పరిమితమై వెనుకబడిపోయిందన్నారు. ఎట్టకేలకు విశ్వవిద్యాలయాలు అనేక ఏఐ, ఎంఎల్ కోర్సులను ప్రారంభించినప్పటికీ సంక్లిష్టమైన ఈ నైపుణ్యాలను నేర్చుకొనేందుకు అవసరమైన మేర ఫ్యాకల్టీ లేరని లావణ్యకుమార్ అన్నారు. అందుకే గుణాత్మకమైన విద్యను అందించడంలో అధిక శాతం కళాశాలలు, ట్రైనింగ్ కంపెనీలు విఫలమయ్యాయని పేర్కొన్నారు. అందుకే మార్కెట్‌లో డిమాండ్ ఉన్నా కావాల్సిన స్కిల్స్ లేక యువత వెనుకబడుతున్నారని.. ఏఐ ఆధారిత కంపెనీలు సైతం ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయన్నారు.

**కాలేజీల్లో మౌలిక సదుపాయాలేవి?**

చైనాతో పోలిస్తే భారత్‌లోని ఎడ్‌టెక్ కంపెనీల సామర్థ్యాలు పూర్తిస్థాయిలో లేవని క్వాలిటీ థాట్ ఫౌండర్, కెరీర్ గైడెన్స్ కోచ్ రమణ భూపతి అభిప్రాయపడ్డారు. దేశంలోని ప్రతిభావంతులంతా విదేశాలకు వలస వెళ్లడం కూడా దీనికి కారణమన్నారు. ఏఐ రంగంలో నూతన ఆవిష్కరణలకు తగ్గట్టుగా ఎడ్‌టెక్ కంపెనీలు వేగాన్ని పెంచుకోలేకపోవడం, ఏఐ నైపుణ్యాలకు అవసరమైన గణితంలో లోతైన పరిజ్ఞానం విద్యార్థులకు కొరవడటం తదితర కారణాల వల్ల భారత్ కొంత వెనుకబడిందని భావిస్తున్నట్లు చెప్పారు. అయితే ఏఐను బోధించాలంటే ఒక సరైన కాన్ఫిగరేషన్ (రూ.1.20 లక్షల ధర, గ్రాఫిక్ కార్డ్ తదితరాలతో) ఉన్న కంప్యూటర్ కావాలని.. కానీ మన దేశంలో అలాంటి కంప్యూటర్లు లేని కాలేజీలే 99 శాతం ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఎడ్‌టెక్ కంపెనీలు ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు పరిశ్రమ అవసరాలకు తగ్గట్లుగా శిక్షణనిస్తే ప్రయోజనం ఉంటుందని అభిప్రాయపడ్డారు.

# మార్కెట్ ముగిసిందిలా.. టాప్ గెయినర్స్ ఇవే..

భారత ఈక్విటీలు ఈ రోజు క్యూ1 ఫలితాలతో నడిచాయి. 2025 జూన్ 30తో ముగిసిన తొలి త్రైమాసికం ఫలితాలను విడుదల చేసిన తర్వాత సెన్సెక్స్‌లో ఎల్ అండ్ టీ, ఎన్టీపీసీ, ఏషియన్ పెయింట్స్ టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. దీనికి తోడు భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందంపై సందిగ్ధత, అమెరికా ఫెడరల్ రిజర్వ్ ద్రవ్యపరపతి విధాన నిర్ణయం ఇన్వెస్టర్లను పక్కకు నెట్టి స్టాక్ మార్కెట్లలో ఒడిదుడుకులకు లోనయ్యాయి.


సెషన్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 143.9 పాయింట్లు (0.18 శాతం) పెరిగి 81,481.86 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 34 పాయింట్లు లాభపడి 24,855.05 వద్ద ముగిసింది.

అదేసమయంలో ఎల్‌అండ్‌టీ, సన్ ఫార్మా, ఎన్టీపీసీ, మారుతీ సుజుకీ, భారతీ ఎయిర్‌టెల్, ట్రెంట్ షేర్లు లాభాల్లో ముగిశాయి. టాటా మోటార్స్, బజాజ్ ఫిన్సర్వ్, కొటక్ మహీంద్రా బ్యాంక్, పవర్ గ్రిడ్, హెచ్‌యూఎల్ షేర్లు నష్టాల్లో ముగిశాయి.

నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.07 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.52 శాతం చొప్పున నష్టపోయాయి. నిఫ్టీ ఐటీ 0.31 శాతం, నిఫ్టీ ఫార్మా 0.01 శాతం, నిఫ్టీ ఎఫ్ఎంసీజీ 0.24 శాతం లాభపడ్డాయి. నిఫ్టీ రియల్టీ (0.96 శాతం), నిఫ్టీ ఆటో (0.6 శాతం) అత్యధికంగా నష్టపోయాయి. మార్కెట్ ఒడిదుడుకుల అంచనాలను కొలిచే ఇండియా వీఐఎక్స్ 2.77 శాతం నష్టంతో 11.21 వద్ద ముగిసింది.



# టీసీఎస్‌లో సీనియర్ల నియామకాలు నిలిపివేత..!




**టెక్ దిగ్గజం టీసీఎస్ సీనియర్ల నియామకాలను నిలిపేసినట్లు వార్తలొస్తున్నాయి. దీంతోపాటు వార్షిక వేతనాల పెంపును ఆపినట్లు ఆంగ్ల పత్రిక ఎకనామిక్ టైమ్స్ కథనం వెలువరించింది. వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకొన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే 12,000 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు సంస్థ సీఈవో కె.కృతివాసన్ ప్రకటించిన సమయంలో ఈ విషయం ప్రచారంలోకి రావడం గమనార్హం.**

ప్రస్తుతం ఐటీ రంగంలో డిమాండ్ తగ్గడం.. కృత్రిమ మేధ నుంచి ముప్పు పొంచి ఉండటం వంటి అంశాలు ఉద్యోగాలపై ప్రభావం చూపిస్తున్నాయి. పరిశ్రమలో పెద్ద కంపెనీగా ఉన్న టీసీఎస్ పాటించే వ్యూహాలను సాఫ్ట్‌వేర్ రంగంలోని ఇతర సంస్థలు కూడా అనుసరించే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పటికే నియమించుకొన్న సీనియర్లను కూడా జాయిన్ చేసుకోవడంలో జాప్యం చేస్తోంది. ఇక పుణే, హైదరాబాద్, చెన్నై, కోల్‌కత్తాలోని బెంచ్‌పై నియమిత కాలం కంటే ఎక్కువగా ఉన్న సిబ్బందిని తొలగించే ప్రక్రియను మొదలుపెట్టింది. ఇప్పటికే ఉద్యోగులు 35 రోజులకు మించి బెంచ్‌పై ఉండకూదనే నియమాన్ని అమలుచేస్తోంది. ఇక కంపెనీలోని పరిణామాలపై ఆ సంస్థ ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు.

టీసీఎస్ చేపట్టిన వాటిల్లో మధ్య, సీనియర్ స్థాయి లేఆఫ్‌లే కంపెనీకి రూ.2,400 నుంచి రూ.3,600 కోట్ల వరకు ఆదా చేయనున్నాయి. కాకపోతే ఈ లేఆఫ్‌లను ఒక్కసారిగా కాకుండా.. మెల్లగా ఓ క్రమ పద్ధతిలో అమలుచేస్తామని సీఈవో వెల్లడించారు. టీసీఎస్ కంపెనీ ఉద్యోగుల్లో 2 శాతం ఉద్యోగులను తొలగించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. దాదాపు 12 వేలకు పైగా ఉద్యోగాల కోత నిర్ణయంపై కేంద్ర ఐటీ మంత్రిత్వశాఖ దృష్టిసారించినట్లు తెలుస్తోంది. మొత్తం పరిస్థితిని కేంద్రం నిశితంగా గమనిస్తోందని, టెక్ కంపెనీతో టచ్‌లో ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. గత ఏడాదికి పైగా వ్యవధిలో కంపెనీ షేరు 30 శాతం కుంగింది. నిఫ్టీ సూచీలోని ఐటీ షేర్లలో ఇదే బలహీనంగా ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

# ఫ్రీగా ఇచ్చే క్రెడిట్ కార్డులు.. పైకి కనిపించని ఛార్జీలు

**ప్రస్తుత రోజుల్లో క్రెడిట్ కార్డుల వినియోగం విస్తృతంగా పెరిగిపోయింది. దాదాపు అన్ని బ్యాంకులు క్రెడిట్ కార్డులు జారీ చేస్తుంటాయి. వీటితో పలు ఇతర సంస్థలూ క్రెడిట్ కార్డులు ఇస్తున్నాయి. వీటిలో అనేక రకాలు ఉన్నాయి. క్రెడిట్ కార్డులకు సాధారణంగా వార్షిక రుసుము ఉంటుంది. ఇది కార్డు రకాన్ని, జారీ చేసే బ్యాంకు, సంస్థను బట్టి ఉంటుంది. కానీ ఎలాంటి రుసుము లేకుండా జీవితకాల ఉచిత క్రెడిట్ కార్డులూ కొన్ని సంస్థలు లేదా బ్యాంకులు ఇస్తున్నాయి. ఉచితమే కదా చాలామంది వీటిని తీసుకుంటున్నారు. అయితే ఎలాంటి రుసుము లేకపోయినప్పటికీ కంటికి కనిపించని కొన్ని ఛార్జీలు వీటికి ఉంటాయి. 'లైఫ్ టైమ్ ఫ్రీ' అయిన క్రెడిట్ కార్డుల విషయంలో దాగిఉన్న ఖర్చులు ఏమిటో ఇక్కడ తెలుసుకుందాం..**



**అధిక వడ్డీ రేట్లు**

వార్షిక రుసుములు లేనప్పటికీ, ఈ కార్డులు అధిక వడ్డీ రేట్లను కలిగి ఉండవచ్చు. తద్వారా మీ కార్డు వాడకం మరింత ఖరీదైనదిగా మారుతుంది. 'లైఫ్ టైమ్ ఫ్రీ' క్రెడిట్ కార్డు కోసం దరఖాస్తు చేసేటప్పుడు దీన్ని పరిగణనలోకి తీసుకోవాలి.

**విదేశీ లావాదేవీ మార్పిడి రుసుము**

వార్షిక రుసుము లేనప్పటికీ, ఈ కార్డులకు ఫారెక్స్ మార్క్‌అప్ ఫీజు (2 నుండి 4 శాతం మధ్య) ఉండవచ్చు. ఇది యూఎస్ డాలర్ లేదా బ్రిటిష్ పౌండ్లు వంటి విదేశీ కరెన్సీలో ఏదైనా ఉత్పత్తి లేదా సర్వీస్ కోసం చెల్లింపు సమయంలో వసూలు చేస్తారు. . 'లైఫ్ టైమ్ ఫ్రీ' క్రెడిట్ కార్డు పొందే సమయంలో ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి.

**ఓవర్ లిమిట్ ఫీజు**

మీరు నగదు ఉపసంహరణను ఎంచుకున్నప్పుడు లేదా క్రెడిట్ లిమిట్ దాటి కార్డును ఉపయోగించినప్పుడు, బ్యాంకు దానిపై ఓవర్ లిమిట్ ఫీజును విధించవచ్చు. ఇది గుర్తుంచుకోవలసిన మరొక అంశం.

**ఆలస్య చెల్లింపు పెనాల్టీలు**

కార్డు జీవితకాలం ఉచితం అయినప్పటికీ క్రెడిట్ కార్డు బిల్లును సకాలంలో చెల్లించనప్పుడు ఆలస్య చెల్లింపు పెనాల్టీలు ఉండవచ్చు. ఇది ఇతర కార్డుల కంటే ఎంత ఎక్కువగా ఉందో చూసుకోవాలి.

**ఇనాక్టివిటీ ఫీజులు**

కొంత మంది కార్డును తరచుగా ఉపయోగించరు. దీనికిగానూ కొన్ని కార్డు ప్రొవైడర్ సంస్థలు రుసుము విధించవచ్చు. మునుపటి సంవత్సరంలో మొత్తం ఖర్చు ఒక పరిమితిని దాటినప్పుడు మాత్రమే బ్యాంకులు కొన్ని కార్డులకు వార్షిక రుసుమును మాఫీ చేస్తాయి.

**ప్రాసెసింగ్ ఫీజు**

ఇది బ్యాంకులు విధించే సాధారణ రుసుము కానప్పటికీ, ప్రాసెసింగ్ లేదా నిర్వహణ ఖర్చుల కోసమంటూ దీన్ని బ్యాంకులు చేస్తాయి. ఇది మీ కార్డుకు సాధారణంగానే ఉందా లేదా మరీ ఎక్కు

# జపాన్‌లో నాగార్జున పేరు 'నాగ్–సమా' ఎందుకంటే...




గత కొంత కాలంగా భారతీయ నటులు, ముఖ్యంగా దక్షిణాది హీరోలకు జపాన్‌లో బ్రహ్మరథం పడుతున్నారు. ఈ ట్రెండ్‌ని టాప్ లెవల్‌కి చేర్చింది సౌతిండియా సూపర్ స్టార్ రజనీకాంత్ అనడం లో సందేహం లేదు. రోబో వంటి సినిమాల ద్వారా ఆయనకు అక్కడ భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఏర్పడింది. ఆ తర్వాత బాహుబలి చిత్రం ద్వారా ప్రభాస్, ఆర్‌ఆర్‌ఆర్ సినిమా ద్వారా జూ.ఎన్టీయార్ వంటి టాలీవుడ్ అగ్ర హీరోలు కూడా జపాన్ సినీ అభిమానుల మనసుల్లో ప్రత్యేక అభిమానం సంపాదించారు.

ప్రస్తుతం వీరి సినిమాల కలెక్షన్లు అక్కడ భారీ స్థాయిలో ఉంటున్నాయి. అదే క్రమంలో ప్రస్తుతం జపాన్‌లో మరో హీరో కూడా స్థానికుల ఆదరణ పొందుతున్నట్టు తెలుస్తోంది. ఆ హీరో ఎవరో కాదు... తెలుగు సీనియర్ స్టార్, కింగ్, అక్కినేని నాగార్జున. ఇటీవల ఆయన జపాన్‌లో తనకంటూ ఒక ప్రత్యేకమైన అభిమానులను సంపాదించుకున్నారు, అంతేకాదు అక్కడ ఆయనను ప్రత్యేకమైన పేరుతో పిలుచుకుంటున్నారు. అక్కడి అభిమానులు నాగార్జునను 'నాగ్ -సామ' అని ఇష్టంగా పేర్కొంటున్నారు. ఇటీవల నాగార్జున నటించిన పలు చిత్రాలు జపాన్ ప్రేక్షకులకు ఆయనను దగ్గర చేశాయి. ముఖ్యంగా హిందీలో రూపొందిన బ్రహ్మాస్త్ర లో నాగార్జున ప్రత్యేక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. అదే విధంగా తాజాగా విడుదలై సూపర్ హిట్ అయిన కుబేరా సినిమాలో నాగార్జున చేసిన కీలక పాత్ర కూడా అక్కడి వారి ఆదరణ చూరగొంది. దాంతో జపాన్‌లో అభిమానులను దక్కించుకున్న భారతీయ నటుల సరసన నాగార్జున కూడా చేరారు.

జపాన్ సంస్కృతిలో, దేవుళ్ళు, రాజవంశం లేదా గొప్ప స్థాయి వ్యక్తులు వంటి ఉన్నత గౌరవం ఉన్న వ్యక్తులకు 'సామ' అనేది వారి స్థాయికి అందించే గౌరవంగా ఉపయోగిస్తారు. నాగార్జున పట్ల అభిమానాన్న చూపడానికి జపనీస్ అభిమానులు ఈ పదాన్ని ఎంచుకోవడం ద్వారా సరిహద్దులకు ఆవలన నాగార్జునకు గొప్ప గౌరవాన్నే అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో రానున్న కూలీ జపాన్‌లో ఎన్ని సంచలనాలు రేకెత్తిస్తుందో అనేది ఆసక్తికరంగా మారింది. ఎందుకంటే ఆ సినిమాలో కూడా తొలిసారి నాగార్జున విలన్‌గా కనిపించనున్నారు. అంటే అది కూడా ఆయన కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన పాత్రగానే చెప్పాలి. మరోవైపు అదే సినిమాలో జపాన్‌లో మంచి ఇమేజ్ ఉన్న రజనీకాంత్ హీరోగా వస్తున్నారు. దీంతో.... ఈ ప్రాజెక్ట్ ఇటు ఇండియాతో పాటు జపాన్‌లో కూడా క్రేజీగా మారిందని చెప్పొచ్చు.

# థియేటర్లలో అతడు.. రీ రిలీజ్ ట్రైలర్ చూశారా?




**టాలీవుడ్‌లో ఈ ఏడాది రీ రిలీజ్ ట్రెండ్ నడుస్తోంది. ఇప్పటికే పలు సినిమాలు మళ్లీ బిగ్ స్క్రీన్‌పై సందడి చేశాయి. తాజాగా మరో టాలీవుడ్ సూపర్ హిట్ మూవీ రీ రిలీజ్‌కు సిద్ధమైంది. ప్రిన్స్ మహేశ్ బాబు పుట్టిన రోజు సందర్భంగా ఆగస్టు 9న అతడు సినిమా థియేటర్లలో కనువిందు చేయనుంది.**

**ఈ నేపథ్యంలోనే అతడు రీ రిలీజ్ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. మహేశ్‌బాబు-త్రివిక్రమ్ కాంబోలో 2005లో వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. మహేశ్ బాబు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంది. ఈ చిత్రంలోని డైలాగ్స్, పాటలు అద్భుతంగా ఆకట్టుకున్నాయి. దీంతో మరోసారి మహేశ్ బాబు- త్రిష కెమిస్ట్రీని థియేటర్లలో చూసే ఛాన్స్ వచ్చింది.**

# భవిష్యత్తులో బెట్టింగ్ యాప్ ప్రమోట్ చేయను



ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ విచారణ ముగిసింది. దాదాపు ఐదు గంటల పాటు ఈయన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారించింది. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసినందుకుగానూ ప్రకాశ్ రాజ్‌తో పాటు మొత్తం 29 మందికి ఈడీ అధికారులు నోటీసులు పంపించారు. బెట్టింగ్ యాప్ ప్రచారం కేసులో మనీ లాండరింగ్ వ్యవహారం జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలోనే విచారణకు హాజరైన ఇతడు.. అనంతరం ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

'చట్టాన్ని గౌరవించే పౌరుడిగా ఈడీ విచారణకు హాజరయ్యాను. దయచేసి బెట్టింగ్ యాప్‌లలో ఆడకండి. కష్టపడి సంపాదించుకోండి. ఒకే ఒక్క బెట్టింగ్ యాప్ తెలియక ప్రమోట్ చేశాను. అందులో నేను డబ్బులు తీసుకోలేదు. భవిష్యత్తులో ఎప్పుడు బెట్టింగ్ యాప్ ప్రమోట్ చేయను' అని ప్రకాశ్ రాజ్ చెప్పుకొచ్చారు. ఇదే కేసులో రానా, మంచు లక్ష్మీ సహా చాలామంది యూట్యూబర్స్ కూడా విచారణకు హాజరు కావాల్సి ఉంది.

# డిఫరెంట్ హారర్ మూవీ.. సైలెంట్‌గా ఓటీటీలోకి



**ఓటీటీలోకి ఎప్పటికప్పుడు కొత్త సినిమాలు వస్తూనే ఉంటాయి. తాజాగా ఓ హాలీవుడ్ హారర్ మూవీ కూడా అందుబాటులోకి వచ్చేసింది. జాంబీ బ్యాక్ డ్రాప్ స్టోరీతో తీసిన ఈ చిత్రానికి ఆస్కార్ అవార్డ్ గ్రహీత, 'స్లమ్ డాగ్ మిలియనీర్' ఫేమ్ డాని బోయెల్ దర్శకత్వం వహించాడు. జూన్‌లో ఇది థియేటర్లలోకి రాగా అలా నెల దాటిందో లేదో ఇప్పుడు డిజిటల్‌గా అందుబాటులోకి వచ్చేసింది. ఇంతకీ ఈ హారర్ మూవీ సంగతేంటి? ఎందులో స్ట్రీమింగ్ అవుతోంది.**

2002లో రిలీజైన '28 డేస్ లేటర్', 2007లో విడుదలైన '28 వీక్స్ లేటర్' చిత్రాలకు సీక్వెల్ '28 ఇయర్స్ లేటర్'. దీన్ని రెండు భాగాలుగా తీశారు. ఇందులోని తొలి పార్ట్ జూన్‌లో రిలీజైంది. కాకపోతే థియేటర్లలో అనుకున్నంతగా ఫెర్ఫార్మ్ చేయలేకపోయింది. మరి అందుకేనేమో ఇప్పుడు రెండు ఓటీటీల్లోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం వీడియో అన్ డిమాండ్(రెంట్ విధానంలో) అమెజాన్ ప్రైమ్, ఆపిల్ ప్లస్ టీవీల్లో ఈ మూవీ చూడొచ్చు. ఇంగ్లీష్‌లో మాత్రమే అందుబాటులో ఉంది.

'28 ఇయర్స్ లేటర్' విషయానికొస్తే.. దాదాపు మూడు దశాబ్దాల క్రితం రేజ్ వైరస్ మహమ్మారిలా వ్యాపించేసరికి బ్రిటన్ ప్రజలందరూ జాంబీలుగా మారిపోతారు. వీళ్ల నుంచి తప్పించుకున్న కొందరు.. ఓ ఐలాండ్‌లో బతుకుతుంటారు. మరి అక్కడికి కూడా జాంబీలు ఎలా వచ్చేశారు. తర్వాత ఏమైందనేదే మిగతా స్టోరీ. 'ఓపెన్‌హైమర్' నటుడు కిలియన్ మర్ఫీ.. జాంబీ పాత్ర చేశాడు. ఈ మూవీకి రెండో భాగం '28 ఇయర్స్ లేటర్: ది బోన్ టెంపుల్'.. వచ్చే జనవరిలో థియేటర్లలోకి రానుంది.
ఇకపోతే ఈ వారం ఓటీటీల్లోకి దాదాపు 25కి పైగా సినిమాలు వెబ్ సిరీసులు రాబోతున్నాయి. వీటిలో పలు తెలుగు చిత్రాలు కూడా ఉండటం విశేషం. 3 బీహెచ్‌కే, తమ్ముడు, నెట్‌వర్క్, జిన్ ద పెట్ లాంటి స్ట్రెయిట్, డబ్బింగ్ మూవీస్ స్ట్రీమింగ్ కాబోతున్నాయి. వీటితో పాటు మరికొన్ని సర్‌ప్రైజ్ రిలీజ్ ఉండొచ్చు.

# బోల్డ్‌గా ఉన్నంత మాత్రాన.. అలా ప్రవర్తిస్తున్నట్టు కాదు: అనసూయ



**బోల్డ్‌గా ఉండటమంటే అగౌరవంగా ప్రవర్తిస్తున్నట్టు కాదని వ్యాఖ్యాత, నటి అనసూయ అన్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. తన డ్రెస్సింగ్ స్టైల్‌ను కొందరు విమర్శించారని అందులో పేర్కొన్నారు.**

**"నన్నెవరు కామెంట్ చేసినా ప్రస్తుతం సైలెంట్‌గా ఉంటున్నా. కానీ, నా జీవన విధానాన్నే విమర్శిస్తుంటే మాట్లాడక తప్పడం లేదు. కొన్ని సోషల్ మీడియా ఛానెల్స్ నన్ను లక్ష్యంగా చేసుకున్నాయి. ఆయా వీడియోల్లో మహిళలే నన్ను విమర్శించారు. వారెవరో నాకు తెలియదు. నేను వారికి తెలియదు. అయినా నా వ్యక్తిగతం గురించి మాట్లాడారు. అవును.. నేను ఓ స్త్రీని, భార్యని, ఇద్దరు పిల్లలకు తల్లిని. నా స్టైల్‌ను ప్రతిబింబించే దుస్తులు ధరించడాన్ని నేను ఆస్వాదిస్తా. నేను ఓ తల్లిగా ప్రవర్తించడంలేదని కొందరు ఆరోపిస్తున్నారు. తల్లికావడం అంటే మనల్ని మనం వదులుకోవడమా?"**

**"నా భర్త, పిల్లలు నన్ను ప్రేమిస్తున్నారు. వారెప్పడూ నన్ను జడ్జ్ చేయలేదు. నాకు సపోర్ట్ చేస్తారు. అది చాలు. విశ్వాసం, దయ, గౌరవం ఉన్న మహిళను (తనను ఉద్దేశించి) చూస్తూ నా పిల్లలు పెరుగుతున్నారు. బోల్డ్‌గా ఉండటమంటే అగౌరవంగా ప్రవర్తిస్తున్నట్టు కాదు. నేను ఇష్టపడే విధంగా దుస్తులు ధరిస్తున్నానంటే నేను నా విలువలను కోల్పోయానని కాదు" అని తనను విమర్శించిన వారికి సమాధానంగా చెప్పారు.**




# ఓటీటీకి సూపర్ హిట్ సినిమా.. ఎక్కడ చూడాలంటే?

కవిన్, అపర్ణాదాస్ జంటగా నటించిన తమిళ చిత్రం 'డా.. డా'. గణేశ్ కె.బాబు దర్శకత్వం వహించిన ఈ చిత్రం తమిళంలో రూ. 40 కోట్లు వసూలు చేసింది. ఎన్నారై శ్రీమతి నీరజ కోట ఈ చిత్రాన్ని 'పాపా' పేరుతో తెలుగులో విడుదల చేశారు. పెళ్లికి ముందే హద్దులు దాటిన ఒక జంట జీవితంలో చోటు చేసుకున్న సంఘటనల ఆధారంగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు.
తాజాగా ఈ మూవీ ఓటీటీ సందడి చేసేందుకు వస్తోంది. ఈ అర్ధరాత్రి నుంచే ఆహా వేదికగా స్ట్రీమింగ్ కానుంది. జూలై 31 నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు ఓటీటీ సంస్థ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. ఈ మేరకు పాపా మూవీ పోస్టర్‌ను పంచుకుంది. కాగా.. ఈ చిత్రంలో మోనిక చిన్నకోట్ల, ఐశ్వర్య, భాగ్యరాజ్, విటీవి గణేష్ ప్రధాన పాత్రల్లో నటించారు. తమిళంలో బ్లాక్ బస్టర్‌గా నిలిచిన డా.. డా సినిమాను మూవీ నీరజ సమర్పణలో పాన్ ఇండియా



## బుమ్రా ఆడటంపై గిల్ కీలక ప్రకటన



టీమిండియా వర్సెస్ ఇంగ్లాండ్ మధ్య ప్రస్తుతం 5 టెస్టుల సిరీస్ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ రెండు జట్ల మధ్య ఇప్పటికే నాలుగు టెస్టులు పూర్తయ్యాయి. రేపటి నుంచి ఐదో టెస్టు లండన్ వేదికగా ప్రారంభం కానుంది. అయితే ఇలాంటి నేపథ్యంలో టీమిండియా యంగ్ కెప్టెన్ గిల్ కీలక ప్రకటన చేశారు.

ఇంగ్లాండ్ తో ఐదో టెస్టులో బుమ్రా ఆడడంపై మ్యాచ్ కంటే ముందు నిర్ణయం తీసుకుంటామని తాజాగా కెప్టెన్ గిల్ వెల్లడించారు. ఈ మేరకు మీడియాకు సమాచారం ఇచ్చారు గిల్. పిచ్ ఫాస్ట్ బౌలర్లకు అనుకూలించేలా ఉందని మీడియా సమావేశంలో అభిప్రాయపడ్డారు. బుమ్రా స్థానంలో అర్షదీప్ సింగ్ ను తీసుకువచ్చేందుకు ప్లాన్ చేస్తున్నామని... కానీ ఆ విషయాన్ని మ్యాచ్ కంటే ముందు నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. అదే సమయంలో టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ప్రవర్తనపై కూడా గిల్ స్పందించారు.

కోచ్ గంభీర్ పట్ల క్యూరేటర్ అలా ఎందుకు ప్రవర్తించారో తనకు అర్థం కావడం లేదని వివరణ ఇచ్చారు. దీంతో గిల్ చేసిన కామెంట్స్ వైరల్ గా మారాయి. ఇది ఇలా ఉండగా.. ఇండియా వర్సెస్ ఇంగ్లాండ్ మధ్య ఇప్పటివరకు నాలుగు టెస్టులు పూర్తయ్యాయి. ఇందులో రెండు టెస్టులు ఇంగ్లాండ్ గెలవగా... ఒకటి టీమిండియా గెలిచింది. అలాగే ఒక మ్యాచ్ డ్రా అయింది.



## అద్భుతం చేసిన భారత మాజీ క్రికెటర్లు.. కానీ, సెమీస్‌లో పాక్‌తో ఢీ.. మ్యాచ్ జరుగుతుందా?

వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ టోర్నీలో ఇండియా చాంపియన్స్ అద్భుతం చేసింది. ఆఖరి మ్యాచ్‌లో వెస్టిండీస్ చాంపియన్స్ చిత్తు చేసి సెమీస్‌లో అడుగుపెట్టింది. ఈ మ్యాచ్‌కు ముందు భారత్ వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఓడిపోవడంతో సెమీస్‌కు చేరుకుంటుందన్న ఆశలు లేవు. కానీ, ఆఖరి మ్యాచ్‌లో ఇండియా సంచలనం సృష్టించింది. మంగళవారం అర్ధరాత్రి జరిగిన మ్యాచ్‌లో వెస్టిండీస్ చాంపియన్స్‌పై 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తప్పక గెలవాల్సిన ఆఖరి మ్యాచ్‌లో ఇండియా చాంపియన్స్ ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన విండీస్‌ను నిర్ణీత 20 ఓవర్లలో మోస్తరు స్కోరు 144/9కే పరిమితం చేసింది. పొలార్డ్(74 నాటౌట్) ఒంటరి పోరాటంతో ఆ జట్టు ఆ స్కోరైనా చేసింది. మిగతా వారిలో ముగ్గురు డకౌటవ్వగా.. మరో ఐదుగురు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. భారత బౌలర్లలో పీయూశ్ చావ్లా 3 వికెట్లు, వరుణ్ ఆరోన్, స్టువర్ట్ బిన్నీ చెరో 2 వికెట్లతో ప్రత్యర్థి పతనాన్ని శాసించారు. 145 పరుగుల లక్ష్యాన్ని ఇండియా చాంపియన్స్ 13.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. స్టువర్ట్ బిన్నీ(50 నాటౌట్) మెరుపు హాఫ్ సెంచరీ బాది కీలక పాత్ర పోషించాడు. శిఖర్ ధావన్(25), యువరాజ్ సింగ్(21), యూసఫ్ పఠాన్(21 నాటౌట్) కూడా విలువైన పరుగులు జోడించారు. ఈ గెలుపుతో భారత్(3 పాయింట్స్) పాయింట్స్ టేబుల్‌లో 4వ స్థానానికి చేరుకుని సెమీస్ బెర్త్ ఖాయం చేసుకుంది. ఇంగ్లాండ్ చాంపియన్స్ కూడా 3 పాయింట్లతోనే ఉన్నప్పటికీ భారత్ మెరుగైన రన్‌రేట్ తో ముందడుగు వేసింది.

సెమీస్‌లో పాకిస్తాన్ చాంపియన్స్‌తో భారత్ చాంపియన్స్ తలపడాల్సి ఉంది. గురువారం జరగాల్సిన ఈ మ్యాచ్ రద్దయ్యే అవకాశాలే ఎక్కువ. పాక్‌తో ఆడేందుకు భారత మాజీ క్రికెటర్లు సిద్ధంగా లేరు. గ్రూపు దశలో ఇరు జట్ల మధ్య మ్యాచ్ రద్దైన విషయం తెలిసిందే. సెమీస్‌లో కూడా ఆడేందుకు భారత్ నిరాకరించినట్టు తెలుస్తోంది. 'ఇంతకుముందు ఆడలేదు. ఇప్పుడు కూడా ఆడను'అని ధావన్ మాట్లాడిన ఓ వీడియో వైరల్‌గా మారింది. సెమీస్ రద్దైతే పాక్‌కే లాభం. గ్రూపు దశలో అగ్రస్థానంలో నిలవడం వల్ల పాకే ఫైనల్‌కు చేరుకుంటుందని విశ్లేషకులు చెబుతున్నారు.

# ఇలాంటి సిరీస్ చూడలేదు.. పిచ్ విషయంలో ఎందుకింత గొడవ?శుభ్‌మన్ గిల్



**లండన్‌లోని ఓవల్ మైదానం వేదికగా భారత్, ఇంగ్లాండ్ మధ్య జులై 31 నుంచి ఐదో టెస్టు మొదలుకానుంది. ఈ మ్యాచ్ కోసం ఇరుజట్లు సన్నద్ధమవుతున్నాయి. అయితే, ప్రాక్టీస్ సందర్భంగా టీమ్‌ఇండియా కోచ్ గౌతమ్ గంభీర్ , ఓవల్ చీఫ్ క్యురేటర్ లీ ఫోర్టిస్‌కు మధ్య ఘర్షణ తలెత్తింది. ఇద్దరి మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం జరిగింది. పిచ్‌కు 2.5 మీటర్ల దూరంలో ఉండాలని టీమ్‌ఇండియా కోచింగ్ బృందానికి మైదానం సిబ్బంది చెప్పడమే అందుకు కారణం. ఈ వ్యవహారంపై బుధవారం నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాట్లాడాడు. పిచ్‌కు 2.5 మీటర్ల దూరం ఉండాలని నిబంధనేమీ లేదని పేర్కొన్నాడు.**

"నాకు గుర్తున్నంత వరకు అలాంటి సూచన లేదు (పిచ్‌కు 2.5 మీటర్లు వెనుక ఉండటం గురించి). రబ్బరు స్పైక్‌లు (సాధారణ షూస్) ధరించి లేదా చెప్పులు లేకుండా పిచ్‌ను దగ్గరగా చూడటం తప్పేమీ కాదు. నిన్న క్యురేటర్ వారిని ఎందుకు ఆపారో.. ఏం జరిగిందో నాకు పూర్తిగా తెలియదు. కానీ, ఈ సిరీస్‌లో మేం నాలుగు మ్యాచ్‌లు ఆడాం. ఎవరూ మమ్మల్ని ఆపలేదు. మాకు ఎన్నో మ్యాచ్‌లు ఆడిన అనుభవం ఉంది. చాలాసార్లు పిచ్‌లను దగ్గర నుంచి చూశాం. అయితే, ఇప్పుడు పిచ్ విషయంలో ఇంత గొడవ ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదు. కెప్టెన్, కోచ్‌లకు పిచ్‌ను నిశితంగా పరిశీలించే హక్కు ఉంది.

**ఇలాంటి సిరీస్ చూడలేదు**

సిరీస్‌లో అతి ముఖ్యమైన విషయం ఏంటంటే అన్ని మ్యాచ్‌లు ఐదో రోజు చివరి సెషన్ వరకు జరిగాయి. ఇలా నాలుగు మ్యాచ్‌లు చివరి వరకు జరిగిన సిరీస్‌ను చూడలేదు. రెండు జట్లు ఇంత కఠినమైన క్రికెట్ ఆడుతున్నప్పుడు మరో మ్యాచ్‌కు మూడు రోజుల విరామం చాలా తక్కువ సమయం. అయితే, ప్రతి మ్యాచ్ తర్వాత ఐదారు రోజుల సమయం ఇస్తే సిరీస్ ముగియడానికి చాలా రోజులు పడుతుంది. అందుకే ఇరుదేశాల బోర్డులు ఈ నిర్ణయం తీసుకున్నాయని భావిస్తున్నా. ఈ మ్యాచ్ కోసం అర్షదీప్ సింగ్‌ను సిద్ధంగా ఉండమని కోరాం. కానీ సాయంత్రం పిచ్‌ను చూసిన తర్వాత ప్లేయింగ్ ఎలెవన్‌పై నిర్ణయం తీసుకుంటాం'' అని గిల్ పేర్కొన్నాడు.

## లెడెకీ పసిడి 'సిక్సర్'

**మహిళల 1500 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో ఆరోసారి స్వర్ణ పతకం సొంతం**



**సింగపూర్:** సంవత్సరాలు గడుస్తున్నాయి.... ప్రత్యర్థులు మారుతున్నారు... కానీ ప్రపంచ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ మహిళల 1500 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో మాత్రం విజేత పేరు మారడం లేదు. 2013 నుంచి 2025 వరకు ఏడు ప్రపంచ చాంపియన్‌షిప్‌లు జరిగాయి. ఇందులో ఆరింటిలో (2013, 2015, 2017, 2022, 2023, 2025) కేటీ లెడెకీకే స్వర్ణ పతకం లభించింది. 2019 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో లెడెకీ ఫైనల్ చేరుకున్నా అనారోగ్యం కారణంగా ఫైనల్ రేసు నుంచి వైదొలిగింది. లేదంటే లెడెకీ ఖాతాలోనే స్వర్ణం చేరేది.

ప్రస్తుతం సింగపూర్‌లో జరుగుతున్న ప్రపంచ చాంపియన్‌షిప్‌లో మంగళవారం జరిగిన 1500 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో లెడెకీ తన సత్తా చాటుకుంది. ఇంతకుముందు 400 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో కాంస్యం నెగ్గిన లెడెకీ... 1500 మీటర్లలో పసిడి పతకం కైవసం చేసుకుంది. 15 నిమిషాల 26.44 సెకన్లలో రేసును ముగించిన ఆమె అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఇతర ఈవెంట్ల సంగతి పక్కన పెడితే... 1500 మీటర్లలో తనకు తిరుగులేదని లెడెకీ మరోసారి నిరూపించింది.

ఈ విభాగంలో ప్రపంచ అత్యుత్తమ స్విమ్మర్‌గా గుర్తింపు సాధించిన లెడెకీ... దశాబ్ద కాలంగా 1500 మీటర్లలో అత్యుత్తమ మహిళా స్విమ్మర్‌గా కొనసాగుతోంది. ఈ ఈవెంట్‌లో ప్రపంచ 26 అత్యుత్తమ ప్రదర్శనల్లో 25 ఆమె పేరిట ఉన్నాయంటే... 1500 మీటర్లలో ఆమె ఆధిపత్యం ఎలా సాగుతోందో అర్థంచేసుకోవచ్చు. 'నాకు ఈ రేసు అంటే చాలా ఇష్టం. 2013లో మొదటిసారి ప్రపంచ రికార్డు బద్దలు కొట్టినప్పటి నుంచి 1500 మీటర్ల రేసును ప్రేమిస్తున్నా. ఇన్నేళ్లలో ఎన్నో గొప్ప విజయాలు దక్కడం ఆనందంగా ఉంది.

కొలనులో అడుగు పెట్టిన ప్రతిసారి అత్యుత్తమ ప్రదర్శన చేయాలనే భావిస్తా. అందుకు తగ్గట్లే కష్టపడతా. ప్రస్తుత టైమింగ్‌తో సంతోషంగా ఉన్నా' అని లెడెకీ వెల్లడించింది. మంగళవారం పోటీలో ఒకానొక దశలో ప్రపంచ రికార్డు వేగం కంటే ముందున్న లెడెకీ చివర్లో కాస్త వెనుకబడింది. మహిళల స్విమ్మింగ్‌లో ఏకఛత్రాధిపత్యం కనబరుస్తున్న లెడెకీకి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఇది 22వ స్వర్ణం కాగా... ఓవరాల్‌గా 28వది. ఒలింపిక్స్‌లో సాధించిన 9 పసిడి పతకాలు, మొత్తంగా 14 మెడల్స్ కలుపుకుంటే... ఓవరాల్‌గా ఆమె పతకాల సంఖ్య 42. అందులో 31 స్వర్ణాలు ఉండటం విశేషం.

అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ అధ్యక్షురాలు, 2004, 2008 ఒలింపిక్స్ 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ స్వర్ణ పతక విజేత క్రిస్టీ కొవెంట్రీ సమక్షంలో లెడెకీ పతకం నెగ్గింది. పోటీల మూడో రోజు మంగళవారం ఐదు అంశాల్లో ఫైనల్స్ నిర్వహించగా... పురుషుల 200 మీటర్ల ఫ్రీ స్టయిల్‌లో రొమేనియాకు చెందిన డేవిడ్ పొపొవిక్ వరుసగా రెండోసారి స్వర్ణ పతకం సాధించగా... పురుషుల 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో దక్షిణాఫ్రికాకు చెందిన పీటర్ కోట్జీ పసిడి పతకం ఖాతాలో వేసుకున్నాడు.

మహిళల 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో జర్మనీకి చెందిన అన్నా ఎలెన్ సంచలనం సృష్టించింది. అమెరికా స్టార్ స్విమ్మర్ కేట్ డగ్లస్‌ను వెనక్కి నెడుతూ బంగారు పతకం కైవసం చేసుకుంది. పురుషుల 200 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో ల్యూక్ హబ్సన్ విజేతగా నిలిచాడు.

**భారత స్విమ్మర్లకు నిరాశ**

ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత స్విమ్మర్ల నిరాశాజనక ప్రదర్శన కొనసాగుతోంది. వరుసగా మూడో రోజు భారత స్విమ్మర్లు హీట్స్ దాటి ముందడుగు వేయలేకపోయారు. పురుషుల 200 మీటర్ల బటర్‌ఫ్లయ్ విభాగంలో సజన్ ప్రకాశ్ 24వ స్థానంలో నిలిచి సెమీఫైనల్‌కు దూరమయ్యాడు. ఈ విభాగంలో తొలి 16 స్థానాల్లో నిలిచిన వాళ్లు సెమీస్‌కు అర్హత సాధించారు. భారత్ నుంచి నేరుగా ఒలింపిక్స్ (టోక్యో 2020)కు అర్హత సాధించిన తొలి స్విమ్మర్‌గా రికార్డు సృష్టించిన 31 ఏళ్ల సజన్ ప్రకాశ్... ఈ టోర్నీ 200 ఫ్రీస్టయిల్‌లో 43వ స్థానంతో సరిపెట్టుకున్నాడు.

ఇక 800 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో ఆర్యన్ నెహ్రా 23వ స్థానంలో నిలిచాడు. మంగళవారం పోటీలో ఆర్యన్ 8 నిమిషాల 21.30 సెకన్లలో లక్ష్యాన్ని చేరాడు. తొలి 8 స్థానాల్లో నిలిచిన వాళ్లు ఫైనల్‌కు చేరారు. మరోవైపు 50 మీటర్ల బటర్‌ఫ్లయ్ విభాగంలోనూ ఆర్యన్ 57వ స్థానంతో సరిపెట్టుకోగా... ఎస్పీ లికిత్ 50వ స్థానంలో నిలిచాడు.

## ఆస్ట్రేలియా పర్యటనకు భారత అండర్-19 జట్టు ప్రకటన.. హైదరాబాద్ కుర్రాడికి చాన్స్

సెప్టెంబర్‌లో భారత అండర్19 జట్టు ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. ఆస్ట్రేలియా అండర్19 జట్టుతో మూడు వన్డే గేములు, రెండు మల్టీ డే మ్యాచ్‌లు ఆడనుంది. ఈ పర్యటనకు బీసీసీఐ బుధవారం భారత అండర్19 జట్టును ప్రకటించింది. ముంబై బ్యాటర్ ఆయుశ్ మాత్రేను సారథిగా కొనసాగించింది. ఇటీవల ఇంగ్లాండ్ పర్యటనను ఆయుశ్ జట్టును నడిపించడంలో సక్సెస్ అయ్యాడు. యూత్ వన్డే సిరీస్ 32తో భారత్ సొంతమైంది. రెండు టెస్టుల సిరీస్ డ్రా చేసుకుంది. విహాన్ మల్హోత్రాను వైస్ కెప్టెన్‌గా నియమించారు. ఇంగ్లాండ్‌లో పర్యటించిన వైభవ్ సూర్యవంశీ, అభిగ్యాన్, రాహుల్ కుమార్, హర్వాన్ష్ సింగ్, అంబ్రీశ్, కనిష్క్, హెనిల్ పటేల్, దీపేశ్, అన్మోల్‌జీత్, నమన్ పుష్పక్ తమ స్థానాలను పదిలం చేసుకున్నారు. మొత్తంగా 17 మందిని ఎంపిక చేశారు. మరో ఐదుగురిని స్టాండ్ బై ప్లేయర్లుగా సెలెక్ట్ అయ్యారు. హైదరాబాద్ కుర్రాడు అలంక్రిత్ స్టాండ్ బై ప్లేయర్‌గా ఎంపికయ్యాడు.



సెప్టెంబర్ 21, 24, 26 తేదీల్లో వన్డే గేములు జరగనున్నాయి. సెప్టెంబర్ 30 అక్టోబర్ 3 వరకు తొలి మల్టీ డే మ్యాచ్, అక్టోబర్ 710 వరకు రెండో మల్టీ డే మ్యాచ్ జరుగుతాయి.

**భారత అండర్-19 జట్టు :** **ఆయుశ్ మాత్రే(కెప్టెన్), విహాన్ మల్హోత్రా, వైభవ్ సూర్యవంశీ, వేదాంత్ త్రివేది, రాహుల్ కుమార్, అభిగ్యాన్ కుండు, హర్వాన్ష్ సింగ్, ఆర్ఎస్ అంబ్రీశ్, కనిష్క చౌహాన్, నమన్ పుష్పక్, హెనిల్ పటేల్, దీపేశ్, కిషన్ కుమార్, అన్మోల్‌జీత్ సింగ్, ఖిలాన్ పటేల్, ఉద్దవ్ మోహన్, అమన్ చౌహాన్.**

**స్టాండ్ బై ప్లేయర్లు :** **యుదాజిత్ గుహ, లక్ష్మణ్, బి.కె. కిశోర్, అలంక్రిత్, ఆర్నవ్.**